గెలుపే లక్ష్యంగా పని చేయండి

- అందరినీ కలుపుకుని ముందుకెళ్లండి
- అభ్యర్థులకు చంద్రబాబు దిశానిర్దేశం



కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేస్తున్న నారా చంద్రబాబు నాయుడు



అధినేత చంద్రబాబునాయుడును చూసేందుకు నిరీక్షిస్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు

మదనపల్లె, మార్చి 28: జిల్లాలో అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, అందరినీ కలుపుకుని ముందుకెళ్లండని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజాగళం ఎన్నికల ప్రచారానికి వచ్చిన అధినేత బుధవారం రాత్రి మదనపల్లెలో బసచేయగా గురువారం ఉదయం పార్టీ అన్నమయ్య జిల్లా అభ్యర్థులు, ఇన్‌చార్జులతో సమావేశమై వారికి దిశానిర్దేశం చేశారు. చంద్రబాబు బస చేసిన బస్సులోకే వీరిని పిలిపించి ఒక్కొక్కరితో వేర్వేరుగా మాట్లాడారు. ఈ క్రమంలో ఆ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, గెలుపునకు ఉన్న అవకాశాలపై సలహాలు, సూచనలు చేశారు. ఇందులో పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మదనపల్లె, పీలేరు, పుంగనూరు, తంబళ్లపల్లె, రాయచోటి అభ్యర్థులు ఎం.షాజహాన్‌బాషా, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, చల్లా బాబురెడ్డి, దాసరిపల్లి జయచంద్రారెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలకు ఎన్నికల వ్యూహాలను వివరించారు. వీరితో పాటు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు, తంబళ్లపల్లె నియోజకవర్గ ఎన్నికల ప్రచార సమన్వయ కర్త సీడ్ మల్లికార్జుననాయుడు, టీడీపీ నేత టి.కృష్ణమనాయుడులు చంద్రబాబును బస్సులో కలిసిన వారిలో ఉన్నారు. బుధవారం రాత్రి బహిరంగ సభ ముగిసిన వెంటనే పుంగనూరు రోడ్డులోని అతిథి గృహానికి చేరుకున్న చంద్రబాబు పార్టీ అసంతృప్తులతో మాట్లాడతారని, అందరినీ ఏకతాటిపైకి తెచ్చి ముందుకెళ్లేలా సూచనలు చేస్తారని అందరూ ఊహించారు. కానీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ అధినేత బుధవారం రాత్రే కాదు గురువారం ఉదయం కూడా ఆ ప్రస్తావనే తీసుకురాలేదు. ఉదయం 10 గంటలకు రెడీ అయిన చంద్రబాబు పార్టీ అభ్యర్థులు, ఇన్‌చార్జ్‌లను బస్సులోకి ఆహ్వానించారు. అరగంటకుపైగా వారితో వేర్వేరుగా మాట్లాడిన ఆయన 10:30 గంటలకు రాప్తాడు వెళ్లడానికి బయలు దేరారు. ఈ క్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి నలుగురు ముఖ్యనేతలను అధినేతకు పరిచయం చేసి పార్టీలో చేర్పించారు. వారికి పార్టీ కండువా కప్పి అధినేత వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్ బుధవారం రాత్రి అతిథి గృహం వద్ద అధినేత చంద్రబాబునాయుడును కలిశారు. పది నిమిషాల పాటు అక్కడి పార్టీ పరిస్థితిపై అధినేత ఆరా తీసినట్లు తెలిసింది. చంద్రబాబును తంబళ్లపల్లె అభ్యర్థి జయచంద్రారెడ్డి, భార్య కల్పనారెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. అప్పటికే ఉదయం 9 గంటల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు అధినేతను కలవడానికి బొకేలు, శాలువలు పట్టుకుని క్యూలో నిల్చున్నారు. మరికొందరు అభిమాన నేతకు వినతిపత్రాలు ఇవ్వడానికి ఎదురు చూస్తున్నారు. బస్సు లోపల పార్టీ అభ్యర్థులతో మాట్లాడిన అనంతరం బయటకు రాగానే ఫొటోలు, సెల్ఫీలు తీసుకోవడానికి వీరంతా ఆసక్తిగా ఎదురు చూశారు. కానీ ఆయన బయటకు రాగానే వీటికి అవకాశం ఇవ్వకుండా అందరికీ నమస్కారం, అభివాదం చేస్తూ కాన్వాయ్ వాహనం ఎక్కారు. ఈ క్రమంలో కొందరు పార్టీ నేతలు, కార్యకర్తలు ఒక్కసారిగా దూసుకు రావడంతో కొంతసేపు గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అక్కడే ఉన్న సెక్యూరిటీ క్లియర్ చేయడంతో వాహనం ఎక్కి కొందరి నుంచి బొకేలు, వినతిపత్రాలు స్వీకరించారు. ఇలా అయిదు నిమిషాల వ్యవధిలో ముందుకు కదిలారు. అధినేత కాన్వాయ్‌ను అనుసరించిన నేతలు, కార్యకర్తలు బీటీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని అధినేతకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఇక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఉదయం 11 గంటలకు రాప్తాడు సభకు బయలుదేరి వెళ్లారు. ఇక్కడ అధినేతను కలిసిన వారిలో టీడీపీ నేతలు బొమ్మనచెరువు శ్రీరాములు, కొండా నరేంద్ర, బోడిపాటి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండ్రెడ్డి, మద్దిపట్ల సూర్యప్రకాశ్, మార్పూరి సుధాకర్ నాయుడు, ఎస్.ఎ.మస్తాన్, దగ్గుపాటి వెంకటేశ్వరరావు, దద్దాల ప్రసాద్‌నాయుడు, ఎస్.ఎం.పర్వీన్‌తాజ్, సురేంద్రయాదవ్, జంగాల శివరాం, ఆర్.గుర్రప్పనాయుడు, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



చంద్రబాబుతో మదనపల్లె అభ్యర్థి షాజహాన్‌బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలి

- ఎంసీసీ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 28: ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తహసీల్దార్‌లు, ఎంపీడీవోలతో ఎంసీసీ నిబంధనలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ తదితర ప్రచార కార్యక్రమాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కుల, మత, ప్రాంతీయపరమైన విద్వేషాలు చేయడం, రెచ్చగొట్టేలా రాజకీయ నేతలు ప్రవర్తించడం, మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ఇతర ప్రార్థనా స్థలాల్లో ఎన్నికల ప్రచారం చేయడం వంటివి చేయకూడదన్నారు. ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు జారీ చేసే నిబంధనలను చక్కగా అవగాహన చేసుకుని నిర్దేశిత సమయంలోనే పనులు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధుల ఫొటోలను తొలగించాలని, రాజకీయ నేతల విగ్రహాలను కప్పి ఉంచాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఎంసీసీని ఉల్లంఘించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్వాడీ, ఆశావర్కర్లు, ఆర్పీలు, వలంటీర్లు రాజకీయ పార్టీల నాయకుల వెంట ర్యాలీల్లో, ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకుండా చూడాలని, ఎవరైనా పాల్గొంటే వారిని వెంటనే సస్పెండ్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణ, ఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార ప్రకటనలకు అనుమతులు తప్పనిసరి

థియేటర్లలో ఎన్నికల ప్రచార ప్రకటనలు రాజకీయ పార్టీల నేతలు, థియేటర్ మేనేజ్‌మెంట్ వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ ఒకప్రకటనలో పేర్కొన్నారు. భారత ఎన్నికల కమిషన్, సార్వత్రిక ఎన్నికలు-2024పై ఈనెల 16న ఇచ్చిన ప్రకటనను అనుసరించి 16వ తేదీ మధ్యాహ్నం నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. ఎంసీసీ అమలులో ఉన్నంత వరకు రాజకీయ పార్టీల నేతలు, థియేటర్ మేనేజ్‌మెంట్ వారు ఎంసీసీకి లోబడి ప్రవర్తించాలన్నారు. ఇందులో భాగంగా రాజకీయ పార్టీలు, పార్టీల నేతలు, థియేటర్ మేనేజ్‌మెంట్ వారు, థియేటర్‌లో ప్రదర్శించబోయే ఎన్నికల ప్రచార ప్రకటనలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు.

4 నుంచి 'సదరం' స్లాట్‌ల బుకింగ్

కలికిరి, మార్చి 28: వివిధ కేటగిరీలకు చెందిన దివ్యాంగులు పొందే ప్రయోజనాల కోసం అవసరమైన 'సదరం' సర్టిఫికెట్ల జారీ కోసం స్క్రీనింగ్ పరీక్షలు చేయడానికి స్లాట్ బుకింగ్‌లు ఏప్రిల్ 4వ తేదీ నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఎంపిక చేసిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన స్లాట్ బుకింగ్‌లు వాటితో పాటు శారీరక పరీక్షలు ఈనెలాఖరుతో పూర్తి కానున్నాయి. ఇక ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన కొత్త స్లాట్‌లు అందుబాటులోకి రానున్నాయి. స్లాట్ బుకింగ్‌లు 4వ తేదీ అందుబాటులోకి వస్తున్నా ఏప్రిల్ నెల 8వ తేదీ నుంచి ఎంపిక చేసుకున్న స్లాట్ తేదీలను బట్టి ఆసుపత్రుల్లో స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నారు. ఆర్థోపెడిక్, మానసిక, కంటి, ఈఎన్‌టీ వైకల్యం ఉన్న వారు నిర్ధారణ సర్టిఫికెట్ల కోసం స్క్రీనింగ్ చేసి అంగవైకల్య శాతాన్ని నిపుణులు నిర్ధారించి ధృవపత్రాలు అర్హులైన వారికి జారీ చేస్తారు. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, బస్సులు, రైళ్లలో ప్రయాణాలు, సామాజిక పింఛన్లు తదితర సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందేందుకు సదరం కేంద్రాలు జారీ చేసే ధృవపత్రాలు మాత్రమే ప్రామాణికమవుతాయి. ఇందుకు అనుగుణంగా జిల్లాలోని ప్రభుత్వ జనరల్, ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో సదరం పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఆసుపత్రుల్లో సోమవారం, గురువారం మాత్రమే పరీక్షలు నిర్వహించనున్నారు. కాబట్టి దివ్యాంగులు తమకు అనువైన రోజులను, ఆసుపత్రులను స్లాట్ బుకింగ్ ద్వారా ఎంపిక చేసుకోవచ్చు. తమ సమీపంలోని సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో 4వ తేదీ నుంచి ఈ స్లాట్ బుకింగ్‌లు ప్రారంభం కానున్నాయి.

జగనన్నా..తాకట్టు, లీజులు సరే

అద్దె బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారన్నా..?

- జిల్లాలో పెరిగిపోతున్న సచివాలయాల అద్దెలు
- రూ.50 లక్షల మేర బకాయిలు



మదనపల్లె పట్టణంలోని మోతీనగర్‌లో అద్దె భవనంలో నడుస్తున్న వార్డు సచివాలయం

మదనపల్లె, మార్చి 28: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని నెరవేర్చే క్రమంలో గ్రామ సచివాలయాలను తీసుకొచ్చామని చెబుతున్న ప్రభుత్వం రాష్ట్ర సచివాలయాన్నే తాకట్టు పెట్టిన విషయం తెలిసిందే. అలాగే పర్యాటకాన్ని మరింత పెంచి పోషించడమే కాదు దానిని మరింత అభివృద్ధి చేసే క్రమంలో టూరిజం ఆస్తులు, భవనాలను లీజుకు ఇవ్వడమే కాదు, విశాఖలోని భవానీ ఐల్యాండ్‌నూ తాకట్టు పెట్టింది మన జగనన్న ప్రభుత్వం. కానీ అదే ఉద్దేశ్యంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వార్డు, గ్రామ సచివాలయాలకు కనీసం నెలవారీ అద్దెలు కూడా చెల్లించలేకపోతోంది. ఓవైపు తాకట్టు, మరోవైపు లీజులు, ఇంకోవైపు సొంత భవనాలు లేక అద్దె కార్యాలయాల్లో నిర్వహిస్తున్న సచివాలయాలకు నెలవారీ చెల్లించాల్సిన అద్దె బకాయిలు తడిసి మోపెడవుతున్నాయి. అద్దెలు నెలవారీ సక్రమంగా చెల్లించాలని, లేకుంటే ఖాళీ చేయాలని భవన, కార్యాలయ యజమానులు చెబుతున్నారు. ఈ క్రమంలో చెల్లింపులు జరగకపోవడంతో కొన్నిచోట్ల వార్డుల్లో కౌన్సిలర్లు, గ్రామాల్లో సర్పంచులు సర్దుబాటు చేస్తున్న సందర్భాలూ లేకపోలేదు. ఇలాగే అయిదు నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో ఏడాది క్రితం బాబు కాలనీలోని కోళ్లబైలు-2 సచివాలయం మూత పడింది. అద్దె చెల్లించిన తర్వాతే తెరవాలని ఇంటి యజమాని తాళం వేయగా, తర్వాత పంచాయతీ పాలకులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు సర్దుబాటు చేసి తర్వాత ప్రభుత్వం నుంచి వచ్చాక తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా శాశ్వత ప్రాతిపాదికన గ్రామాల్లో సచివాలయ భవనాలు మంజూరు చేసినా నిధులు లేక అవి చాలాచోట్ల అర్ధాంతరంగా ఆగిపోయాయి. అయితే పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ స్థలాలు లేకపోవడంతో కొత్త భవనాల నిర్మాణం జరగలేదు. ఇప్పటికే మున్సిపాలిటీకి చెందిన వివిధ భవనాలు, మూతపడిన స్కూల్స్ భవనాల్లో వార్డు సచివాలయాలను నిర్వహిస్తున్నారు. అలాగే పట్టణ, వాటి శివారు ప్రాంతాల్లోని పంచాయతీల్లోనూ సొంత భవనాలు లేకపోవడంతో ప్రైవేటు నివాసాలు, భవనాలను అద్దెకు తీసుకుని గ్రామ, వార్డు సచివాలయాలను నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను వాటికి ప్రభుత్వం అద్దె చెల్లిస్తోంది. అది కూడా నెలనెలా సక్రమంగా చెల్లించకపోవడంతో ఆ బకాయిలు తడిసి మోపెడవుతున్నాయి.

జిల్లాలో మొత్తం 501 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 414, పట్టణ ప్రాంతాల్లో 87 సచివాలయాలు ఉన్నాయి. మొత్తం మీద తీసుకుంటే 82 గ్రామ, వార్డు సచివాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వీటికి చదరపు గజానికి రూ.6 నుంచి రూ.10 చొప్పున భవనం విస్తీర్ణాన్ని బట్టి గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వేల నుంచి రూ.15 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.10 వేల నుంచి రూ.20 వేలకు అద్దె చెల్లిస్తున్నారు. ఇది కూడా నెలనెలా సక్రమంగా చెల్లించడం లేదని భవన యజమానులు వాపోతున్నారు. అదే ప్రైవేటు వ్యక్తులకు బాడుగకు ఇస్తే అడ్వాన్సుతో పాటు నెలవారీగా క్రమం తప్పకుండా డబ్బులు వస్తాయని చెబుతున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా తీసుకుంటే నాలుగు నుంచి ఆరు నెలలుగా అద్దె పెండింగ్‌లో ఉంది. ఇలా జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాలకు కలిపి సుమారు రూ.50 లక్షల మేర బకాయి ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మూడు నెలలకు ఒకేసారి చెల్లిస్తే తర్వాత అయిదు నుంచి ఆరు నెలలు ఆ ప్రస్తావన ఉండదని, అద్దెలపై ఆధారపడి జీవించే తమ పరిస్థితి ఏంటని కొందరు భవన యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోనే అధికంగా మదనపల్లె మున్సిపాలిటీలో మొత్తం 44 వార్డు సచివాయాలు ఉండగా, అందులో 25 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇందులో నెలకు రూ.2.50 లక్షల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకూ అయిదు నెలలుగా బకాయిలు ఉన్నాయి. అలాగే జిల్లా కేంద్రం రాయచోటిలో 25 వార్డు సచివాలయాలు ఉండగా, అందులో 22 కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇక్కడ కూడా అయిదు నెలలుగా రూ.10 లక్షల మేర బకాయిలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అలాగే రాజంపేట మున్సిపాలిటీలో 13 వార్డు సచివాలయాలు ఉండగా, అందులో ఏడు భవనాలు అద్దెవే ఉన్నాయి. అలాగే జిల్లాలోని 30 మండలాల్లో మదనపల్లె డివిజన్‌లో ఏడు, రాయచోటి డివిజన్‌లో ఆరు, రాజంపేట డివిజన్‌లో పదిహేను గ్రామ సచివాలయాలు కలిపి మొత్తం 28 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఈ మొత్తం కలిపి రూ.50 లక్షలు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. సచివాలయ యజమానులకు చెల్లించాల్సిన అద్దెలను వారి పేరున సీఎఫ్‌ఎంఎస్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తున్నామని, ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే, వారి ఖాతాలకు జమ అవుతుందని అటు జిల్లా, ఇటు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.



మదనపల్లె మండలం బాబుకాలనీలో ప్రైవేటు నివాసంలో నిర్వహిస్తున్న కోళ్లబైలు-2 గ్రామ సచివాలయం

అధికారులే ఓటర్లు

- మొక్కుబడిగా అవగాహన సదస్సు



క్యూలైన్‌లో ఉన్న బీఎల్‌వోలు

ఒంటిమిట్ట, మార్చి 28: అధికారులే ఓటర్లుగా ప్రజలకు ఈవీఎంలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమం మొక్కుబడిగా సాగింది. ఈవీఎంలపై ప్రజలకు, బీఎల్‌వోలకు అవగాహన కల్పించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఏర్పాటు మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అందుకు భిన్నంగా మండలంలోని బీఎల్‌వోలు మొక్కుబడిగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటిసారి ఓటర్ల జాబితాలో ఓటు కలిగిన యువతీ, యువకులకు, వృద్ధులకు అవగాహన కల్పించడం కోసం కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ ఆదేశాలతో నిర్వహించారు. స్థానికంగా ఉన్న బీఎల్‌వోలు ప్రజలకు సమాచారం ఇవ్వకుండా మొక్కుబడిగా తామే ఓటర్లుగా క్యూలైన్‌లో నిలబడి ఓటరు మిషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు వివరించాల్సిన కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహించి చేతులు దులుపుకున్నారు. స్థానికంగా బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ప్రజలకు సమాచారం అందించడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు నెలకొన్నాయి. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట వెంకటరమణ, స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్‌ఐ వెంకటరమణ, బీఎల్‌వోలు, వీఆర్వోలు పాల్గొన్నారు.



అవగాహన కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

చెంగల్‌పట్టు ఎక్స్‌ప్రెస్ పుదుచ్చేరి వరకు పొడిగింపు



కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 28 : కాచిగూడ - చెంగల్‌పట్టు మధ్య నడుస్తున్న చెంగల్‌పట్టు ఎక్స్‌ప్రెస్‌ను పుదుచ్చేరి వరకు పొడిగించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్ధన్ తెలిపారు. వారంలో మూడురోజుల పాటు ఈ రైలు పుదుచ్చేరి వరకు నడవనుంది. మిగిలిన నాలుగు రోజులు కాచిగూడ నుంచి చెంగల్‌పట్టు మధ్య నడవనుందన్నారు. ప్రస్తుతం 17651 / 17652 నెంబర్ల పేరుతో నడుస్తున్న ఈ రైలు జూలై 8 నుంచి 17653 / 17654లుగా రైల్వే అధికారులు మార్చనున్నారని చెప్పారు.

కలెక్షన్ కింగ్.. ఆ అధికారి



- వారానికి మూడు రోజులే విధులకు హాజరు
- ప్రతి సెక్షన్ నుంచి మామూళ్లు ఇవ్వాల్సిందే
- జిల్లా అధికారినీ లెక్కచేయని వైనం
- ఇది జిల్లా ఖజానా కార్యాలయంలోని ఓ అధికారి తీరు



జిల్లా ఖజానా ప్రధాన కార్యాలయం

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 28: జిల్లా ఖజానా కార్యాలయంలో ఆయనది చాలా కీలకమైన బాధ్యత గల కుర్చీ. ఆ కుర్చీకి న్యాయం చేయకుండా మామూళ్ల మత్తులో మునిగిపోయి వారానికి మూడుసార్లు మాత్రమే విధులకు హాజరై మూడు పూలు, ఆరు కాయలుగా ఉద్యోగం చేస్తున్నారన్న విమర్శలు జోరుగా ఉన్నాయి. ఈ కార్యాలయంలోని ప్రతి సీటు వారు ఆయనకు మామూళ్లు ఇవ్వాల్సిందే. జిల్లా ఖజానా అధికారిని ఆయన లెక్కచేయడం లేదనే వాదన బలంగా వినిపిస్తోంది. ఈ కార్యాలయానికి బిల్లుల కోసం వచ్చిన ఉద్యోగుల దగ్గర నుంచి కలెక్షన్లు తీసుకునేందుకు కొంతమంది మధ్యవర్తులను పెట్టి టీ స్టాల్, హోటళ్లలో మామూళ్ల వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఈ కార్యాలయంలో బలంగా వినపడుతున్నాయి. కలెక్టరేట్ బిల్లులు కావడం లేదని కలెక్టర్ కార్యాలయం నుంచి ఓ ఉద్యోగి ఈ అధికారికి ఫోన్ చేసి అడుగగా నేను బయట ఉన్నాను మీకు ఏదైనా సమస్య ఉంటే మా డీటీవో గారి దగ్గరికి వెళ్లి అడగండి అని సలహా ఇచ్చాడని తెలిసింది. గతంలో ఉన్న కలెక్టరేట్ ఏవో రెవెన్యూ వారి దగ్గర నుంచి మామూళ్లు తీసుకోవద్దు అని చెప్పినా లెక్కచేయకుండా కొంతమంది దగ్గర మామూళ్లు తీసుకుని బిల్లులు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందిలో కొందరు ఐదు నిమిషాలు ఆలస్యంగా విధులకు హాజరైతే వెంటనే అటెండెన్స్ రిజిస్టర్‌లో ఆబ్సెంట్ వేస్తున్నారని, ఈ విషయమై ఓ ఉద్యోగి దిశ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చింది. ఈ ఫిర్యాదుపై పోలీసులు ట్రెజరీ కార్యాలయానికి వచ్చి అసలు ట్రెజరీ కార్యాలయంలో ఏం జరుగుతోంది, ఎవరు ఎవరిని వేధిస్తున్నారు అన్న విషయాలపై పూర్తిగా ఆరా తీసి వెళ్లారని తెలిసింది. అసలే సిబ్బంది అంతంత మాత్రాన ఉన్నారు. ఉద్యోగానికి సరిగ్గా హాజరుకాకపోతే ఎలా అని డీటీవో చాలాసార్లు హెచ్చరించినట్లు తెలిసింది. ఈ విషయాలను పట్టించుకోని ఏటీవో తనదైన శైలిలో ఉద్యోగం చేసుకుంటూ అందినకాడికి దోచేస్తున్నాడని కార్యాలయం సిబ్బంది చెవులు కొరుక్కుంటున్నారు.

నామమాత్రానికే జిల్లా అధికారి

రాయచోటి జిల్లా కేంద్రం అయిన తర్వాత రెండవ జిల్లా ట్రెజరీ అధికారిని డమ్మీని చేసి కార్యాలయాన్ని మొత్తం తన కనుసన్నల్లో పెట్టుకుని ఏటీవో అందిన కాడికి దోచేస్తున్నాడని సిబ్బంది బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈ విషయం ఆ జిల్లా అధికారికి తెలిసి చాలాసార్లు సెలవుల్లో కూడా వెళ్లినట్లు తెలిసింది. ఏ డిపార్టుమెంట్ వారు బిల్లులు రాలేదని ఈ అధికారికి ఫోన్ చేసి అడిగితే మా ఏటీవోను అడగండి అని చెబితే ఆ విషయంపై ఆయనకు ఫోన్‌లు చేస్తే వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తారన్న ప్రచారం ఉంది. ఈ విషయమై డీటీవో మహబూబ్‌ను వివరణ అడగగా ముఖ్యమైన విషయాలు ఏమైనా ఉంటే నేను చూస్తాను. ఆఫీస్ పరంగా అన్ని విషయాలు ఏటీవో చూస్తాడని చెప్పారు.

ఏటీవో ఖాదర్‌వలి వివరణ

ఈ విషయంపై ఏటీవోను వివరణ కోరగా ఇక్కడ అంత సీన్ లేదు. కడప జిల్లాలో దాదాపు 300 డీడీవో కోడ్‌లు ఉంటే జిల్లాలో కేవలం 45 డీడీవో కోడ్‌లు మాత్రమే ఉన్నాయి. మాకు ఎవరు డబ్బులు ఇస్తారు, ఇక్కడ ఎవరూ మామూళ్లు తీసుకోవడం లేదు. మీకు ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చారు అని చెప్పారు. వారానికి మూడుసార్లు మాత్రమే విధులకు హాజరవుతారు అన్న మాట వాస్తవం కాదు. నాకు సీఎల్ పెట్టుకునే వెసులుబాటు ఉంది కనుక నేను సీఎల్ పెట్టుకుని ఉన్నాను. అంతేగానీ విధులకు డుమ్మా కొట్టడం లేదని చెప్పారు.

గండిలో హుండీల లెక్కింపు


లెక్కింపును పర్యవేక్షిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

చక్రాయపేట, మార్చి 28: గండి క్షేత్రంలో గురువారం హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవల పాటి ముకుందరెడ్డి మాట్లాడుతూ 52 రోజులకు గాను రూ.9,89,197, అన్నదానం హుండీ ద్వారా రూ.11,619 కలిపి మొత్తం రూ.10,00,816 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ కావలి కృష్ణతేజ, పాలక మండలి సభ్యులు, దేవాదాయ శాఖ సూపర్‌వైజర్ ప్రసాదరావు, ప్రధాన, ఉపప్రధాన అర్చకులు కేసరి స్వామి, రాజాస్వామి, ఏపీజీబీ మేనేజర్ అశోక్‌కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను

బడిలో చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మిట్టా కేశవరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 28: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ, సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కడప మండల వనరుల కేంద్రంలో సహిత విద్య అవగాహన సదస్సు మిట్టా కేశవరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులైన పిల్లల పట్ల దయతో వ్యవహరించడంతో పాటు సమీప పాఠశాలల్లో చేర్పించాలన్నారు. విజన్ 2025లో భాగంగా ప్రతి విద్యార్థికీ డిజిటల్ పరిజ్ఞానం అందించాలన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వారి పనులు వారే చేసుకోవడంతో పాటు వారిలో ఉన్న నైపుణ్యాలను మెరుగుపరచాలన్నారు. మెడికల్ డిపార్ట్‌మెంటు వారు దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఆరోగ్య సలహాలు, సూచనలు అందించాలని కోరారు. ప్రత్యేక అవసరాలు గల వారి చట్టాలను వారికి అందాల్సిన ప్రభుత్వ పథకాలను రిమ్స్ వైద్యులు విష్ణువందన, ఫక్రుద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ప్రధానోపాధ్యాయులు, సంక్షేమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మెడికల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

18 మోటార్ బైకులు స్వాధీనం

ఇద్దరు నిందితుల అరెస్టు


వివరాలు తెలుపుతున్న డీఎస్పీ, పట్టుబడ్డ బైకులు, నిందితులు, పోలీసులు

ముద్దనూరు మార్చి 28: మండల పరిధి కొర్రపాడు గ్రామానికి చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి 18 మోటర్ బైకులు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ టీడీ యశ్వంత్ తెలిపారు. గురువారం స్థానికపోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీమాట్లాడుతూ ఈనెల 22వ తేదీ రైల్వే స్టేషన్ ఎదుట రైల్వే ఉద్యోగి పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. దీనిపై ప్రత్యేక నిఘా పెట్టి మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో జమ్మలమడుగు బైపాస్ రోడ్డులో సీఐ దస్తగిరి సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా కొర్రపాడు గ్రామానికి చెందిన పాస్కులపాటి అబ్దుల్ బాషా, కొత్తపల్లె చిన్న కుళ్లాయప్పలు బైకుపై వస్తూ పట్టుబడ్డారు. బైకు సంబంధించి ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో అనుమానంతో విచారించగా బైకుల దొంగతనం చేస్తున్నట్లు తెలిపారు. దీంతో రైల్వే స్టేషన్ ఎదుట చోరీకి గురైన వాహనంతో పాటు మరికొన్ని 17 మోటర్ బైకులు వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహనాలను పాత తాళం చెవులను ఉపయోగించి బైకుల చోరీకి పాల్పడుతు న్నట్లు తెలిపారు. ముద్దనూరు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కమలాపురం టౌన్‌లో 17 చోరీ చేసినట్లు తెలిపారు. ఎంతో చాకచక్యంగా బైకుల దొంగలను పట్టుకున్న పోలీసులను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో సీఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


నీలం అయ్యప్ప మృతదేహం

జమ్మలమడుగు, మార్చి 28: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని నాగులకట్ట వీధిలో గురువారం నీలం అయ్యప్ప (30) అనే వ్యక్తి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. నాగులకట్టవీధిలో నివాసం ఉంటున్న నీలం అయ్యప్పకు వివాహం కాలేదు. ఇతను షేర్ మార్కెట్ సంబంధించిన వ్యాపారంలో ఉన్నాడు. ఇటీవల అప్పులు పెరిగి అప్పుల బాధతో అనారోగ్యానికి గురయ్యాడు. ఉన్నట్లుండి మనస్థాపం చెంది ఇంటిలోనే ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఖాదర్‌వలి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


సునీల్‌కుమార్‌రెడ్డి మృతదేహం

లింగాల, మార్చి 28: మండలంలోని దొండ్లవాగు గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ బి.వి.కృష్ణయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దొండ్లవాగు గ్రామానికి చెందిన తుమ్మలూరు రామాంజనేయరెడ్డి కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డి (30) గురువారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారన్నారు. ఆత్మహత్యకు గల కారణాలను ఫిర్యాదు అనంతరం వెల్లడిస్తామని ఎస్ఐ వివరించారు.

కోడూరు కోచ్‌కు జాతీయ క్రీడా పురస్కారం


జేసీ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న రవిశంకర్‌రాజు

రైల్వేకోడూరు(రూరల్), మార్చి 28: జాతీయ స్థాయి క్రీడా పురస్కారానికి కోడూరు కోచ్ హెచ్.రవిశంకర్‌రాజు ఎంపికైనట్లు జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ గౌస్ తెలిపారు. ఈ మేరకు గురువారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ చేతుల మీదగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా కోచ్ రవిశంకర్ రాజు మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుంచి రాష్ట్ర, జిల్లా స్థాయి విద్యార్థులకు తైక్వాండోలో శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో బంగారు, వెండి పురస్కారాలు అందుకున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి క్రీడా పురస్కారం రావడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. జాతీయ స్థాయి పురస్కారం కోసం సహాయ, సహకారులు అందించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

చెన్నూరు, మార్చి 28 : చెన్నూరు సమీపంలోని హైవేపై బుడ్డాయపల్లె క్రాస్ రోడ్డు వద్ద గురువారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో చెన్నూరు కేఓఆర్ కాలనీకి చెందిన మహేశ్, ఖాజీపేట మండలానికి చెందిన మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. కేఓఆర్ కాలనీ నుంచి చెన్నూరు గ్రామంలోకి ద్విచక్రవాహనంపై వస్తున్న మహేశ్ అలాగే కడప నుంచి ఖాజీపేట వైపు వెళుతున్న మరో వ్యక్తి వాహనం ఢీకొనడంతో వారు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.


అక్రమాల సాగుకు..

అడ్డగోలు విద్యుత్

- పట్టా భూములకు కనెక్షన్..
- ఆక్రమిత భూములకు వాడకం
- అన్యాక్రాంతమవుతున్న రిజర్వు ఫారెస్టు
- ప్రేక్షకపాత్రలో అధికార యంత్రాంగం

అటవీ భూములను ఆక్రమించి పంటలు సాగు చేయడమే కాదు.. వీటికి విద్యుత్ సరఫరా సైతం అడ్డగోలుగా సాగిపోతోంది. పట్టా భూముల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కనెక్షన్లు తీసుకుని అక్రమంగా సాగు చేస్తున్న పొలాలకు, ఉద్యానపంటలకు సాగునీటిని అందిస్తున్నారు.




రిజర్వు ఫారెస్టులో సాగైన మామిడి తోట

కడప (ఎన్టీఆర్ సర్కిల్), మార్చి 28: వల్లూరు మండలంలో పాపాఘ్ని నది ఒడ్డున ప్రజాప్రయోజనాల కోసం ప్రభుత్వం సుమారు 561 ఎకరాల భూమిని కేటాయించింది. మొదట ఈ భూముల్లో ఓ స్వచ్ఛంద సంస్థ మొక్కలు నాటి పరిరక్షించే బాధ్యత చేపట్టింది. ఈ తరుణంలో సమీప గ్రామాల్లోని కొంతమంది దృష్టి ఈ భూములపై పడింది. స్వల్పకాలిక పంటలే కాకుండా మామిడి వనాలు సైతం పెంచేందుకు ప్రయత్నించారు. దాదాపు 20 సంవత్సరాల క్రితం నుంచి ఈ తంతు జరుగుతోంది. అడ్డుకోవలసిన అటవీ అధికారులు అప్పట్లో చూసీచూడనట్లు వ్యవహరించడంతో క్రమేణా ఆక్రమణదారుల సంఖ్య పెరిగిపోతూ వచ్చింది. ఒక పక్క పాపాఘ్ని నదితో పాటు మరో పక్క పెన్నానది కూడా సమీపంలోనే ఉండడంతో ఉద్యాన పంటల సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. ఆ తరువాత వచ్చిన అటవీ అధికారులు ఆక్రమణల తొలగింపునకు ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకుండాపోయింది. ఇదిలా ఉంటే ఒకే సామాజిక వర్గానికి చెందిన వారే ఇక్కడ ఆక్రమణదారులు కావడం విశేషం. ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారు ఎవరైనా అటవీ భూములు సాగుచేస్తే ఆక్రమణదారులు తమ పలుకుబడి ఉపయోగించి వాటిని తొలగించడంతో పాటు వారిపై కేసులు పెట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ఈ క్రమంలో కమలాపురం రిజర్వు ఫారెస్టులో ప్రజా అవసరాలకోసం ప్రభుత్వం కేటాయించిన భూమి అంతా అన్యాక్రాంతం అయినట్లు తెలుస్తోంది. ఉన్న కొద్దిపాటి స్థలాన్ని కూడా ఇటీవల ఓ గ్రామస్థాయి నాయకుడు అధికార పార్టీ నేతల అండతో తమ అనుచర వర్గానికి, బంధువులకు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది.

అడ్డగోలుగా విద్యుత్ సరఫరా

ఆక్రమిత అటవీ భూముల్లో సాగైన మామిడి తోటలకు అడ్డగోలుగా విద్యుత్ సరఫరా అందుతోంది. కొంత మంది తమపట్టా భూములకు విద్యుత్ కనెక్షన్లు పొంది ఆక్రమించి సాగు చేసిన తోటలకు లైన్లు లాగినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం మొత్తం రాజకీయ నాయకుల అండతోనే సాగుతుండడంతో విద్యుత్ అధికారులు కూడా అటు వైపు కన్నెత్తి చూడడంలేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. విద్యుత్ శాఖలో కొంత మంది కిందిస్థాయి సిబ్బంది ఆక్రమణదారులు ఇచ్చే డబ్బు కోసం విద్యుత్ పరికరాలు సైతం వారికి సరఫరా చేస్తున్నట్లు సమాచారం. భారీ స్థాయిలో విద్యుత్ చౌర్యం జరుగుతున్నప్పటికీ ఏ ఒక్కరూ దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రెండు గ్రూపులుగా అక్రమార్కులు

కమలాపురం రిజర్వు ఫారెస్టులో భూ ఆక్రమణలకు పాల్పడ్డ ఆక్రమణదారులు రెండు గ్రూపులుగా విడిపోయారు. వీరిలో కొంత మంది ఒక పార్టీ వైపు మరి కొంత మంది మరో పార్టీ వైపు ఉన్నారు. దీంతో ప్రధాన పార్టీల్లో ఏ పార్టీ అధికారంలో వచ్చినా వీరంతా సేఫ్ సైడ్‌గా ఉంటారని అంటున్నారు. ఏ పార్టీ నాయకులైనా తమ వ్యతిరేక పార్టీకి సంబంధించిన ఆక్రమణదారుల జోలికి పోరని.. ఎందుకంటే వారి భూఆక్రమణలు తొలగించేందుకు ప్రయత్నిస్తే వీరి భూములు కూడా పోతాయని జాగ్రత్తగా ఉంటారని అంటున్నారు. దీంతో కమలాపురం రిజర్వు ఫారెస్టులో ఆక్రమణలు పెరిగిపోతున్నాయని అంటున్నారు.

అక్రమ విద్యుత్ సరఫరాపై పరిశీలిస్తాం

అక్రమ విద్యుత్ సరఫరాపై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వల్లూరు ట్రాన్స్‌కో ఏఈ డానియేల్ తెలిపారు. ఇప్పటి వరకు తమ దృష్టికి ఈ అంశం రాలేదని, తాను ఇటీవలే ఇక్కడ బాధ్యతలు స్వీకరించానన్నారు.

కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెచ్చావా..?

- సీఎం జగన్ సిద్ధం సభ విఫలం
- ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన వైసీపీ
- టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 28 : రాష్ట్రంలో 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా తెస్తానన్న జగన్ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నెహ్రూ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంతో పోరాడి సాధిస్తానన్న ప్రత్యేక హోదాను తన కేసుల కోసం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టుపెట్టిన ద్రోహి జగన్ అన్నారు. ఐదేళ్లలో రాష్ట్ర ప్రజలను వంచించి పరిపాలిం చిన జగన్ ఏ మోహం పెట్టుకుని సిద్ధం సభలు పెట్టి ఓట్లు అడు గుతున్నాడన్నారు. నీ మోసకారి తనం అర్థం చేసుకున్న ప్రజలు సిద్ధం సభకు రాకుండా దుమ్మెకొట్టారన్నారు.

లక్ష మందికి పైగా సభ అని చెబితే.. కేవలం 30వేలకు లోపు జనం వచ్చారంటే నీ పాలనను ప్రజ లు తిరస్కరించారన్నారు. నీ పాలన చూసిన కేంద్రంలోని బీజేపీ పెద్దలు రాష్ట్రం అధోగతి పాలవుతుందని.. వైసీపీ ప్రభుత్వానికి చరమ గీతం పాడేందుకే టీడీపీతో పొత్తు పెట్టుకుందన్నారు. వివేకానందరెడ్డి ని చంపిన వాళ్లను చంద్రబాబు వెంట బెట్టుకుని తిరుగుతున్నాడని జగన్ ఆరోపించడం హేయమైనదన్నారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో జైలులో ఉన్నది ఎవరు.. నిందితుడైన అవినాష్‌రెడ్డిని సీబీఐ అరెస్టు చేయనీయకుండా కాపాడుతున్నది నీవు కాదా జగన్ అని విమర్శించారు. నిసిగ్గుగా మీ చిన్నాన్నను చంపిన నిందితుడైన అవి నాష్‌రెడ్డిని పక్కన పెట్టుకుంది నీవా చంద్రాబాబా అని ప్రశ్నించారు. నీ అబద్దాలు, దుర్మార్గాలు, మోసాలు రాష్ట్ర ప్రజలు గుర్తించారన్నారు.

అందుకే నీ సభలకు బస్సు యాత్రకు జనం నుంచి స్పందన లేద న్నారు. ప్రొద్దుటూరులో రూ.516 కోట్లకు వేసిన శిలాఫలకాలు, అభివృద్ధి పనులు ఏమయ్యాయో సభలో మాట్లాడలేని పరిస్థితి వైసీ పీది అన్నారు. 516 కోట్ల నిధులు కేటాయించిన ఆ పనులకు ఎంత మేరకు బిల్లులు చెల్లించారో చెప్పగలరా అన్నారు. ప్రొద్దుటూరులో మీరు వేసిన ఫ్లెక్సీలకు సైతం మట్కా గుట్కా బుకీల డబ్బులతో వేసినవేనని ఆరోపించారు. సమావేశంలో మాజీఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, మార్తల లక్ష్మీరెడ్డి జనసేన ప్రతినిధి సుంకర మురళీ తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీల అమలులో జగన్ విఫలం

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నజీర్

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 28: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్ర విభజన హామీల అమలులో పూర్తిగా విఫలం అయ్యారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పీఎం నజీర్ విమర్శించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొంత జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీని కూడా సాధించలేకపోయారన్నారు. బీజేపీతో లోపాయికారిగా పొత్తుపెట్టుకుని పార్లమెంటులో వివిధ రకాల బిల్లులకు మద్దతు తెలిపిన జగన్ విభజన హామీలను ఎందుకు సాధించుకోలేకపోయారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చెప్పే మాయమాటలను నమ్మే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. వైఎస్ వివేకానందరెడ్డిని చంపింది ఎవరో జిల్లా ప్రజలందరికీ తెలుసునని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా సిద్ధం బహిరంగ సభలో సీఎం మాట్లాడడం దారుణమన్నారు. సొంత చెల్లెళ్లే ఆయన హత్యపై విమర్శలు చేస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు. వివేకా హంతకులకు ఎప్పటికైనా శిక్ష తప్పదని స్పష్టం చేశారు. త్వరలోనే ప్రజలు జగన్‌ను ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కిడ్నాప్‌నకు యత్నించిన గ్యాంగ్ అరెస్టు

- కారు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం


కిడ్నాప్ వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వాసుదేవన్

కొత్తచెరువు, మార్చి 28: మండల కేంద్రానికి చెందిన ఉప్పు వెంకటాచలపతిని ఈనెల 24వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు కిడ్నాప్ చేసేందుకు కొందరు యత్నించారు. బాధితుడు వెంకటాచలపతి వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేపట్టారు. ఈ క్రమంలో ముదిగుబ్బ మండలం రాళ్లఅనంతపురం క్రాస్ వద్ద గురువారం తెల్లవారుజామున 8 మందిని అరెస్టు చేశారు. కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వాసుదేవన్ సీఐ రాజారమేశ్‌తో కలిసి అరెస్టు వివరాలను వెల్లడించారు. కొత్తచెరువు గ్రామానికి చెందిన ఉప్పుచలపతి చికెన్‌సెంటర్‌ను నడుపుకుంటూ జీవనం సాగించేవారు. అయితే అతడి సమీప బంధువు అయిన భానుచందర్ పెనుకొండలో పంచర్ షాపు నిర్వహించేవాడు. వ్యసనాలకు బానిస అయిన అతను ఎలాగైనా అక్రమమార్గంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో పెనుకొండ ప్రాంతంలో ఉన్న తన స్నేహితులు, కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన తన బంధువుల సహాయంతో ప్రణాళిక ప్రకారం చలపతిని కిడ్నాప్ చేయడానికి పథకం వేశారు. ఈ క్రమంలో చలపతిని ఈనెల 24న తన ఇంటి సమీపంలో కిడ్నాప్ చేసి కారులో ముదిగుబ్బ వైపునకు వెళ్లారు. విషయం పసిగట్టిన చలపతి భార్య 100 కాల్ చేయడంతో పోలీసులు అప్రమత్తమై ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేపట్టారు. దీంతో తాము దొరికిపోతామన్న భయంతో వారు చలపతిని ముదిగుబ్బ గ్రామ శివారులో వదిలి పారిపోయారు. కిడ్నాప్‌నకు యత్నించిన 8 మందిని అదుపులోకి తీసుకున్నామని, అందులో ఒక బాలనేరస్థుడు కూడా ఉన్నాడని డీఎస్పీ తెలిపారు. అలాగే కారు 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పెనుకొండ మండలం షైలపురం గ్రామానికి చెందిన బానుచందర్, చెన్నేకొత్తపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి మొండిగట్ల శ్రావణ్, రొద్దం మండలం బొక్సంపల్లికి చెందిన హరిజన సూరి, కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన రుషికేశవరెడ్డి, పంగ విష్ణువర్ధన్, ఇరగం శివగంగాధర్‌రెడ్డి, ఇరగం గంగాధర్‌రెడ్డి, కడప జిల్లా రాజుపాలెం మండలానికి చెందిన కందుకూరు శివకిశోర్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. కేసును ఛేదించిన సీఐ రాజారమేశ్, ముదిగుబ్బ పోలీసులను ఎస్పీ మాధవరెడ్డి అభినందించి ప్రోత్సాహక నగదు బహుమతికి ఎంపిక చేశారని చెప్పారు.

మసీదులోనే వ్యక్తి దారుణ హత్య


హత్యకు గురైన ఇంతియాజ్ అలీఖాన్

రాయచోటిటౌన్, మార్చి 28: జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని బండ్లపెంటలో గల ఫాతిమా మసీదులో గురువారం రాత్రి హత్య జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. పట్టణంలోని కొత్తపల్లెకు చెందిన ఇంతియాజ్ అలీఖాన్ (55), సాబ్‌జాన్ ఇరువురూ వరుసకు సోదరులవుతారు. వీరిరువురి మధ్య గత కొద్దిరోజులుగా డబ్బుల విషయమై సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇఫ్తార్ అనంతరం ఇంతియాజ్ అలీఖాన్ బండ్లపెంటలోని ఫాతిమా మసీదులో నమాజ్ చేసుకుంటుండగా సాబ్‌జాన్ అక్కడికి వెళ్లి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. కొనఊపిరితో ఉన్న అతడిని ఆసుపత్రికి తరలించే లోపు మృతి చెందాడు. ఈ మేరకు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ భక్తవత్సలం సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన హత్యపై విచారించడంతో పాటు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల తనిఖీల్లో రూ.17 లక్షల నగదు సీజ్

కడప (క్రైం), మార్చి 28: కడప నగరంలోని అప్సరా సర్కిల్ వద్ద గురువారం రాత్రి చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించగా రూ.17 లక్షల నగదు పట్టుబడింది. కడపకు చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పోలీసులు ఆపి తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి రసీదులు లేకుండా ఉన్న ఆ నగదును గుర్తించారు. పట్టుకున్న డబ్బు వివరాలను సీఐ అడిగినప్పటికీ ఆ వ్యక్తి నుంచి సరైన సమాధానం రాకపోవడం, డబ్బుకు సంబంధించి రసీదులు, పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగించినట్లు సీఐ వివరించారు.

లింగాలలో రూ.7.18 లక్షలు పట్టివేత

లింగాల, మార్చి 28: మండలంలోని అంబకపల్లె గ్రామ చెక్‌పోస్టు వద్ద గురువారం సాయంత్రం చేపట్టిన వాహనాల తనిఖీల్లో ఆరుగురి నుంచి రూ.7.18 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు లింగాల ఎస్ఐ బి.వి.కృష్ణయ్య తెలిపారు. ముదిగుబ్బ రోడ్డు నుంచి వస్తున్న బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీలు చేయగా ఈ నగదు పట్టుబడిందన్నారు. ఈ నగదుకు సంబంధించి ఎటువంటి బిల్లులు, ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేశామన్నారు. ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు.

పొలతల హుండీ ఆదాయం రూ.30.75 లక్షలు


కానుకలను లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

పెండ్లిమర్రి, మార్చి 28: మండలంలోని పొలతల క్షేత్రంలో మల్లేశ్వర స్వామి దేవస్థానంలోని హుండీలను గురువారం లెక్కించారు. కడప గ్రూప్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్ పర్యవేక్షణంలో లెక్కించగా రూ.30,75,482 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నాగమల్లారెడ్డి, పోలీస్ సిబ్బంది, ఇండియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్, సిబ్బంది, శ్రీవారి సేవకులు బాలశివనాగిరెడ్డి బృందం, రాజగోపాల్‌రెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌తో ముస్తాక్ హుస్సేన్ భేటీ


లోకేశ్‌తో ముస్తాక్ హుస్సేన్

రాయచోటి టౌన్, మార్చి 28: ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్, రాయచోటి టీడీపీ మైనార్టీ నేత ముస్తాక్ హుస్సేన్ గురువారం టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌తో భేటీ అయినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాదులోని లోకేశ్ నివాసంలో కలిసి మాట్లాడినట్లు తెలిపారు. రాయచోటిలో గెలుపు కోసం చేపట్టాల్సిన చర్యలపై లోకేశ్ అడిగి తెలుసుకున్నారని, తగిన గుర్తింపు ఇస్తానని, పార్టీ కోసం పనిచేయాలని సూచించినట్లు తెలిపారు.

వేడుకగా సీతారాముల కల్యాణం

చిన్నమండెం, మార్చి 28: మండలంలోని దేవగుడిపల్లె గ్రామం కుర్వపల్లెలో కోదండ రామాలయ కల్యాణం కన్నుల పండుగగా సాగింది. ఆలయ దాత, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు, ఆలయ కమిటీ, గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుగవాసి ప్రసాద్‌బాబుకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించారు. అలాగే ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు విచ్చేసిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమానికి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు.

కూటమితోనే ప్రత్యేక బీసీ రక్షణ చట్టం

● టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, మార్చి 28: తెలుగుదేశం, జనసేన, ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే బీసీల అభ్యున్నతి ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేస్తామని రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన సంబేపల్లె జయహో బీసీ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఆయనకు గ్రామ, మండల బీసీలు ఘనస్వాగతం పలికారు. టీడీపీ బీసీల ప్రభుత్వం అని బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు మరింత మెరుగుపరిచేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీసీల రిజర్వేషన్ శాతాన్ని తగ్గించి బీసీలకు జగన్ అన్యాయం చేశారన్నారు. సంబేపల్లె, చిన్నమండెం మండలాల్లో వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న బీసీ కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని, పార్టీ అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న శ్రీనివాస్ రిజర్వాయర్, ఝరికోన పనులు పూర్తి చేయించి సాగు, తాగునీరు అందిస్తామన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మండల బీసీలకు సింహభాగాన్ని కేటాయిస్తామని తెలిపారు. అనంతరం ఊటుపాలెంకు చెందిన రామచంద్ర, గొల్లపల్లి నాగరాజు, పలువురు సభ్యులతో కలిసి వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కుప్పం పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా, మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, శశిధర్‌రెడ్డి, నారా ప్రభాకర్‌నాయుడు, దుద్యాల రవీంద్రారెడ్డి, విష్ణువర్థన్‌రెడ్డి, గుట్టపల్లి ప్రభాకర్‌నాయుడు, వేణుగోపాల్ నాయుడు, మట్లి శ్రీనివాసులునాయుడు తదితర టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో విఫలం

రాయచోటిటౌన్, మార్చి 28: మున్సిపాలిటీలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో విఫలమైందని రాయచోటి నియోజకవర్గ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు వార్డుల్లో మౌలిక సదుపాయాలు విస్మరించారని, డ్రైనేజీ కాలువలు, రోడ్లు, వీధిలైట్లు వెలగడం లేదన్నారు. దోచుకోవడం, దాచుకోవడంలో వైసీపీ ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ అభివృద్ధిలో చూపలేదన్నారు. రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, మాజీ కౌన్సిలర్ సంజీవరెడ్డి, గవర్నర్ కల్యాణ మండపం యజమాని జాఫర్‌అలీఖాన్, టీడీపీ నేతలు ఖాదర్ మోహిద్దీన్, రమణారెడ్డి, జయరాంరెడ్డి, శివారెడ్డి, పీవీపీ దేవేంద్రారెడ్డి, మహబూబ్‌బాషా, అర్షద్, బాలకొండారెడ్డి, గంగిరెడ్డి, కిశోర్, అమీర్, నాగరాజా, నాయుడు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర


గంగమ్మ తల్లి మూలవిరాట్

ఒంటిమిట్ట, మార్చి 28: మండల పరిధిలోని కొత్త మాధవరం గ్రామంలో నడివీధి గంగమ్మ జాతర కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారు గ్రామంలోకి ప్రవేశించి గ్రామంలోని నడివీధిలో గంగమ్మ తల్లిని ప్రతిష్ఠించారు. అమ్మవారికి పెద్దఎత్తున జంతుబలిదానాలు ఇచ్చి మొక్కులు చెల్లించారు. అనంతరం సాయంత్రం పెద్దఎత్తున మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు సంవత్సరాలకు ఒకసారి గ్రామంలో నిర్వహించడంతో పెద్ద ఎత్తున చేనేతలు తమ కుటుంబ సభ్యులతో బంధువులతో జాతర కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. అమ్మవారిని రాజంపేట టీడీపీ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి, మండలంలో టీడీపీ నాయకులు అమ్మవారిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులు చింతగింజల సుబ్రమణ్యం, నామాల వెంకటయ్య, బోడిచెర్ల శ్రీనివాసులు, టీడీపీ నాయకులు విందు ఏర్పాటు చేశారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా నరసింహారావు



రైల్వేకోడూరు(రూరల్), మార్చి 28: కోడూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా నరసింహారావు ఎన్నికైనట్లు బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారి సిద్ధిలింగం మధుసూదన్ తెలిపారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న వెంకటరామరాజు పదవి కాలం ముగియడంతో మొట్టమొదటి సారిగా ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో మద్దిన శంకరయ్యపై నరసింహారావు 13 ఓట్లతో గెలిచారు. ప్రధాన కార్యదర్శిగా తోట చంద్రమోహన్, కార్యదర్శులుగా గజపతిరాజు, పుల్లెల రమేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను బార్ అసోసియేషన్ బృందం ఘనంగా సత్కరించారు.

ఓటు హక్కును వినియోగించుకోండి


ఓటు హక్కుపై ప్రజలకు వివరిస్తున్న దృశ్యం

సంబేపల్లె, మార్చి 28: మండలంలో త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్ఐ రామకృష్ణ గురువారం తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు నిర్వహించి శాంతియుత వాతావరణాన్ని కలిగిస్తామని ప్రతిఒక్కరూ వారి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర బలగాలతో దేవపట్లలో కవాతు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రజలకు ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. అధైర్య పడాల్సిన పనిలేదని, శాంతియుతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.

ప్రారంభమైన రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న నగిరిపాడు రంగనాయకస్వామి, దేదీప్యమానంగా వెలుగొందుతున్న ఆలయం

చిట్వేలి, మార్చి 28: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన నగిరిపాడు రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 7వ తేది వరకు జరగనున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ పోలిన నాగేశ్వరనాయుడు, ప్రధాన కార్యదర్శి దుగ్గిన ఈశ్వరయ్య నాయుడు, ఉపాధ్యక్షుడు శంకరయ్య యాదవ్, జాయింట్ సెక్రటరీ ఆర్.నరసరామయ్య, ట్రెజరర్ శ్రీధర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు రంగాచారి, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. అదేవిధంగా రంగనాయకస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా సుప్రభాతం, రంగనామ సంకీర్తన, అభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ముగిసిన జాతీయ వర్క్‌షాపు


ముగింపు కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

రాజంపేట, మార్చి 28: రాజంపేట మండలం బోయనపల్లె అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలోని సీఎస్ఈ విభాగంలో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ వర్క్‌షాపు కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి రీసోర్స్ పర్సన్‌గా గుంటూరు ఇన్ ఫీ స్కిల్ ఎడ్యుటెక్ ప్రైవేటు లిమిటెడ్ డేటా సైంటిస్ట్ అండ్ బ్రాంచ్‌మేనేజర్ పి.శ్రీరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డేటా సైన్స్, యంత్ర అధ్యయనం, డేటా సైన్స్‌లో విశేష మూలాలు, యంత్ర అధ్యయనంలో డేటా సంగ్రహణ, సాక్ష్యాలు, యంత్ర అధ్యయనంపై విస్తృత అవగాహన, డేటా విశ్లేషణ లాభాలు, డేటా సంగ్రహణం నుంచి మోడల్ నిర్మాణం వరకు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పలు విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుబ్బారావు, కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భూపాలన్, సీఈవో సమరసింహారెడ్డి, కో-ఫౌండర్ స్నేహలత రెడ్డి, ప్రవళిక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన పాలేటమ్మ జాతర


అమ్మవారి మూలవిరాట్

చిన్నమండెం, మార్చి 28: మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీలోని దేవళంపేటలో వెలసిన పాలేటమ్మ జాతర మహోత్సవం గురువారం వైభవంగా ముగిసింది. ఇందులో భాగంగా జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాధన్ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం రాత్రి రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కేశాపురం దేవళంపేటలోని మూగి రెడ్డెప్ప ఇంటి వద్ద విందులో పాల్గొని చాందినీ బండ్లకు కొబ్బరికాయ కొట్టి ఆయన చేతుల మీదుగా బండ్లను ప్రారంభించారు. ఈ జాతరకు 17 చాందినీ బండ్లను కట్టారు. డీజే పాటలు, చెక్కభజనలు, కోలాటాలు, వివిధ రకాల వాయిద్యాలు, వేషధారణలు చూపర్లను అలరింపజేశాయి. 20 మంది పోలీసు సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు : తహసీల్దార్


ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు నాటుతున్న రెవెన్యూ సిబ్బంది

ఓబులవారిపల్లె, మార్చి 28: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహశీల్దారు శేషగిరిరావు అన్నారు. మండలంలోని పెద్దఓరంపాడు గ్రామ రెవెన్యూ పొలాలకు సంబంధించిన ఆక్రమణలపై ఈ నెల 20న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఆక్రమణలకు అడ్డే లేదు' కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. 1150 సర్వే నెంబరులో సుమారు 50 ఎకరాలు ప్రభుత్వ భూమిని రాజకీయ నాయకుల అండతో అక్రమంగా చదును చేస్తున్నారని గ్రామస్థులు.. రెవెన్యూ అధికారులు, జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కథనం వెలువడటంతో ఎన్నికల విధులపై వచ్చిన మండల తహశీల్దారు శేషగిరిరావు గురువారం స్పందించి పొలంలో రెవెన్యూ సిబ్బందిని పంపించారు. దీనిపై తహశీల్దారు మాట్లాడుతూ అక్రమంగా చదును చేస్తున్న పొలంలో గతంలో పెట్టిన హెచ్చరిక బోర్డును తొలగించి చదును చేస్తున్న డోజర్ వాహనాన్ని అడ్డుకొని పోలీసులకు అప్పగించామన్నారు. అదే స్థానంలో రెవెన్యూ సిబ్బందితో తిరిగి ప్రభుత్వ హెచ్చరిక బోర్డును నాటి ఆ భూమికి సంబంధించిన వివరాలు ఉన్నత స్థాయి అధికారులకు చేరవేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను అక్రమంగా పొందేందుకు ప్రయత్నం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న పలు గ్రామ పంచాయతీల ప్రజలు, కార్మిక పోరాట సంఘం నాయకులు, దళిత నాయకులు మాట్లాడుతూ... ఆక్రమిత భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు


మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

లక్కిరెడ్డిపల్లె, మార్చి 28: ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నభోజన పథకంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని మండల విద్యాశాఖ అధికారి-1 చక్రేనాయక్ పేర్కొన్నారు. గురువారం మద్దిరేవుల పంచాయతీలోని అప్పలరాజుగారిపల్లె ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్నభోజనాన్ని ఆయన పరిశీలించారు. వంట నాణ్యతగా ఉండాలని ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం పిల్లలకు అందించాలన్నారు. ఒంటిపూట బడులున్నందున ఉదయాన్నే పిల్లలు పాఠశాలకు చేరుకొని మధ్యాహ్న భోజనం అనంతరం ఇంటికి వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు


గాలివీడు బాలుర ఉన్నత పాఠశాలలో బయటకు వస్తున్న విద్యార్థులు

గాలివీడు,మార్చి 28: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 18వ తేది నుంచి ప్రారంభమై గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు చెందిన 601 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాశారని, ఇందులో బాలుర ఉన్నత పాఠశాలలో 180 మంది పరీక్షలు రాశారని మండల విద్యాధికారులు పేర్కొన్నారు. గత ఏడాది ఆరు సబ్జెక్టులకు ఆరు పేపర్లను నిర్వహించగా ఈ ఏడాది సైన్స్ సబ్జెక్టు, ఫిజికల్ సైన్స్ పేపర్ వన్, బైలాజికల్ సైన్స్ పేపర్-2గా ప్రభుత్వం రెండు పరీక్షలను నిర్వహించింది. ఆయా పరిశోధన కేంద్రాల్లో స్థానిక ఎస్ఐ వెంకటప్రసాద్, పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పరీక్ష జరుగు కేంద్రాల్లో ప్రతిరోజు సిటింగ్స్ స్క్వాడ్‌తో పాటు అప్పుడప్పుడు ఫ్లయింగ్ స్క్వాడ్ పరీక్షలను పర్యవేక్షించారు. అధికారుల సమన్వయంతో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

ఓబులవారిపల్లె, మార్చి 28: కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని జిల్లా మహిళ అధ్యక్షురాలు గోశాలదేవి, పార్టీ నాయకులు శాంతయ్యలు కోరారు. మండలంలోని గద్దలరేవుపల్లిలో వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పట్టించుకోరా..?

లక్కిరెడ్డిపల్లె, మార్చి 28: మండలంలోని అనంతపురం దళితవాడలో నెలకొన్న తాగునీటి సమస్యను పట్టించుకోరా అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలలుగా తాగునీటితో ఇబ్బందులు పడుతూ పక్క గ్రామాలకు, వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఏపీ దళిత సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓబులేసు, గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం దళితవాడలో ఖాళీ బిందెలతో మహిళలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా అనంతపురం దళితవాడలో తాగునీటితో దళితులు చాలకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎన్నికల ముందు నాయకులు దళితులను మోసం చేసి అన్నమయ్య బ్యాక్ వాటర్ తెప్పిస్తామని చెప్పినా ఇంతవరకు పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన అన్నారు. ఈ మధ్య వేసిన బోరులో అరకొరా నీరు వస్తోందని అవి ఏమాత్రం చాలడం లేదని వాపోతున్నారు. కనీసం ట్యాంకర్ల ద్వారా అయినా నీటిని సరఫరా చేసి దళితుల దాహం తీర్చాలని కోరారు.


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి


పూజలు చేస్తున్న టీడీపీ నేతలు

రాజంపేటటౌన్, మార్చి 28: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని టీడీపీ నేత అనుమలగుండం మనోహర్ తెలిపారు. గురువారం పట్టణంలోని మన్నూరు గంగమ్మ గుడి వద్ద టీడీపీ అధికారంలోకి రావాలని కోరుతూ గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పొంగుబాళ్లు పెట్టి ప్రత్యేకంగా పూజించారు. అనంతరం వారు మాట్లాడుతూ అందరికీ ఆమోదయోగ్యమైన నాయకున్ని గెలిపించుకొని రాష్ట్రంలో అత్యధిక మెజారిటీ వచ్చేలా ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కుమార్, ఎల్.శ్రీనివాసులు, సుబ్బరాయుడు, నాగరాజు, చెంగమ్మ, సుబ్బరాయుడు, రవి, ప్రతాప్‌రాజు, గణేష్, వెంకటసుబ్బయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.

రెండు స్కూటర్లు ఢీ - ఒకరికి గాయాలు

ఒంటిమిట్ట, మార్చి 28: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎదురెదురుగా రెండు స్కూటర్లు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప వైపు నుంచి రాజంపేట వైపు వెళుతున్న స్కూటర్‌ను.. రాజంపేట వైపు నుంచి కడపకు వెళుతున్న స్కూటర్ ఢీకొనడంతో పోలు బుచ్చయ్యగారిపల్లె గ్రామానికి చెందిన నల్గొండ సుబ్బారెడ్డి వ్యక్తికి కాలు విరిగింది. వెంటనే స్థానికులు 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి పనులను తనిఖీ చేసిన ఏపీవో


ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఏపీవో

రామాపురం, మార్చి 28: మండలంలోని కసిరెడ్డిగారిపల్లె, నల్లగుట్టపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఏపీవో సురేంద్రనాథ్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుద్దమళ్ల గ్రామం మినహా మిగిలిన 12 గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయని ఆయన అన్నారు. ఉపాధి పనులు డంపింగ్ యార్డు చెరువులో పూడికతీత పనులు చేస్తున్నారని, కూలీలు ప్రస్తుతం 1050 మంది మండల వ్యాప్తంగా ఉపాధి కూలి పనులు చేస్తున్నారని, ఉపాధి పనులు కావాల్సిన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే వెంటనే పనులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఏలు, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో కౌన్సిలర్ మృతి

రాయచోటిటౌన్, మార్చి 28: రాయచోటి మున్సిపాలిటీలోని 30వ వార్డు కౌన్సిలర్ ఆసిఫ్‌అలీఖాన్ (55)గురువారం అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందాడు. మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో మసీదుకు నమాజ్‌కు వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తూ ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో సొమ్మసిల్లి కిందపడిపోతుండగా గమనించిన తోటి మనిషి వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు కలరు. కౌన్సిలర్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్లు ఫయాజుర్ రెహమాన్, దశరథరామిరెడ్డిలతో పాటు తోటి కౌన్సిలర్లు ఆయన మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబులు వేర్వేరుగా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రెడ్డెమ్మ హుండీ ఆదాయం రూ.4.72 లక్షలు

గుర్రంకొండ, మార్చి 28: మండలంలోని చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో గురువారం అమ్మవారి హుండీని దేవాదాయశాఖ అధికారి రవికిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ క్రమంలో హుండీ ద్వారా రూ.4,72,290 నగదు, 17 గ్రాముల బంగారం, 260 గ్రాముల వెండి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఈవో మంజుల, చైర్మెన్ నరసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం

మండలంలోని తరిగొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని వేదపండితులు గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున కల్యాణం చేయడం అనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా చేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ - ఇరువురికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పుల్లంపేట, మార్చి 28: మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల వద్ద కడప-చెన్నై రహదారిలో గురువారం రెండు కార్లు ఢీకొనడంతో ఇరువురు గాయపడ్డట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. కుక్కలదొడ్డిలోని సిల్వర్ బిల్స్ చైర్మన్ నాగరాజన్ తన కుటుంబ సభ్యులతో రాజంపేటలో జరిగే నిశ్చితార్థానికి కారులో బయలుదేరారు. పుల్లంపేట సమీపంలో ఆదర్శ పాఠశాల వద్దకు రాగానే ఎర్రగుంట్ల నుంచి వస్తున్న కారు రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొన్నది. ఈ ప్రమాదంలో సుబ్బరత్నమ్మ, గంగిరెడ్డిలు గాయాలపాలయ్యారు. వీరిని 108లో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.



రేణిగుంట సమీపంలోని గోదాములో బయటపడ్డ వైసీపీ ప్రచార సామగ్రి

మాటలేనా చేతలేవి సార్లూ?

ఎన్నికల యంత్రాంగం తీరుపై విమర్శలు

రేణిగుంట గోదాముల్లో పార్టీయేతర సామగ్రిపై మౌనం ఎందుకు?

శ్రీకాళహస్తి ఆర్వో వైఫల్యం, జిల్లా అధికారుల చోద్యం

ఎన్నికలపై సమీక్షల్లో అధికారుల మాటలు కోటలు దాటుతున్నాయి... అయితే వారి అడుగులు మాత్రం గడప కూడా దాటడం లేదు. విధి నిర్వహణలో అలక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా అధికారులు తరచూ చెబుతున్నా ఆచరణలో మాత్రం దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. రేణిగుంట గోదాముల్లో అధికార పార్టీ ప్రచార సామగ్రి బయటపడిన ఉదంతంలో మండల స్థాయి మొదలు జిల్లా అధికారుల దాకా వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.ప్రత్యేకించి శ్రీకాళహస్తి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తుండగా జిల్లాస్థాయి అధికారుల బాధ్యతా రాహిత్యం సైతం జనంలో చర్చకు వస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

గోదాముల్లో దొరికిన రూ. 1.22 కోట్ల తాయిలాలపై చర్యలేవీ?

రేణిగుంటలోని ప్రైవేటు గోదాముల్లో వైసీపీకి చెందిన ప్రచార సామగ్రి భారీగా బయట పడిన సంగతి తెలిసిందే. అయితే దానికి అదనంగా ప్రచారేతర సామగ్రి కూడా పెద్ద ఎత్తున లభ్యమైంది. చీరలు, బొట్టుబిళ్ళలు, టీ షర్టులు, డైరీలు వంటివి ఓటర్లకు పంపిణీ చేసి వారిని ప్రలోభపెట్టడానికి ఉద్దేశించే గోదాముల్లో నిల్వ వుంచినట్టు భావించాల్సి వస్తోంది. వీటిని సీజ్ చేసిన అధికారులు వాటి విలువ రూ.1.22 కోట్లుగా అంచనా వేశారు. అయితే తదుపరి చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నిల్వ వుంచిన సామగ్రి నిజంగా వైసీపీ కొనుగోలు చేసివుంటే పార్టీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సి వుంది. పార్టీ కొనుగోలు చేయని పక్షంలో వాటిని ఎవరు కొనుగోలు చేశారు? ఎక్కడ నుంచీ తెప్పించారు? అనే వివరాలు ఆరా తీసి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సి వుంది. ఆ క్రమంలో గోదాముల యాజమాన్యంపైనా చర్యలు తప్పనిసరి. అయితే ఇప్పటి వరకూ రేణిగుంట మండల అధికారుల నుంచీ శ్రీకాళహస్తి నియోజకవర్గ అధికారుల దాకా, చివరికి జిల్లా అధికారులు కూడా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ప్రచార సామగ్రి దొరికితే పార్టీ లెక్కలోకి లేదా అభ్యర్థి లెక్కలోకి వ్యయం నమోదు చేయడం జరుగుతుంది. అదే నగదు, మద్యం నిల్వలు దొరికితే వెంటనే క్రిమినల్ కేసులు నమోదవుతాయి. ఓటర్లను ప్రలోభపెట్టే తాయిలాలు దొరికినా అవే చర్యలు తీసుకోవాల్సి వుంది. గత మంగళవారం గోదాముల్లో ఈ సామగ్రిని గుర్తించగా మూడు రోజులవుతున్నా కనీసం సామగ్రి ఎవరికి సంబంధించిందనే విషయం కూడా అధికారులు గుర్తించలేకపోతున్నారు. గోదాము అద్దెకు తీసుకున్నది ఎవరు? ఎన్నికల తాయిలాలు ఎవరు ఎక్కడి నుంచీ తెప్పించారు? అన్న దానిపై దృష్టి సారించడం లేదు. సీజ్ చేసి ఈసీకి నివేదించామని చెబుతూ చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. గోదాముల్లో ప్రచార సామగ్రి, తాయిలాలు బయట పడితే రెండవ రోజు సాయంత్రం అది కూడా టీడీపీ నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాక గానీ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న శ్రీకాళహస్తి ఆర్డీవో పరిశీలనకు వెళ్ళలేదు. ఆర్వో తీరుపై టీడీపీ నేతలతో పాటు సామాన్య జనం కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆర్వోపై ఎన్నికల కమిషన్‌కు కూడా పెద్దఎత్తున ఫిర్యాదులు వెళుతున్నట్టు సమాచారం.

ప్రచార సామగ్రి, తాయిలాల విషయమై నోరు మెదపని అధికారులు

నెలకు రూ. 5వేల గౌరవ వేతనంపై పనిచేసే వలంటీరును తొలగించిన విషయం కూడా గొప్పగా మీడియాకు ప్రకటనలు జారీ చేస్తున్న జిల్లా అధికార యంత్రాంగం రేణిగుంటలో రూ. కోట్ల విలువైన అధికార పార్టీ ప్రచార సామగ్రి, ఓటర్లను ప్రలోభపెట్టే తాయిలాలు దొరికితే నోరు విప్పకపోవడం తీవ్ర విమర్శలకు, సందేహాలకు తావిస్తోంది. గోదాముల్లో తొలుత తనిఖీలు జరిపి వస్తువులను గుర్తించిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గానీ, తర్వాత పరిశీలించిన జీఎస్టీ అధికారులు గానీ ఆ వివరాలేమీ బయట పెట్టలేదు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి హోదాలో వున్న రేణిగుంట తహసిల్దారుదీ అదే పరిస్థితి. ఇక రిటర్నింగ్ అధికారైన శ్రీకాళహస్తి ఆర్డీవో గోదాముల వద్ద మీడియాతో మాట్లాడి దొరికిందంతా వైసీపీ ప్రచార సామగ్రేనని చెప్పి చేతులు దులుపుకున్నారు. అక్కడ దొరికిన సామగ్రి వైసీపీయే కొనుగోలు చేసివుంటే ఏయే సంస్థల నుంచీ కొనుగోలు చేశారు? ఎంత మొత్తం చెల్లించారు? ఆ బిల్లులు సామగ్రి పరిమాణానికి సరిపోతున్నాయా లేదా? ఓటర్ల కోసం తెప్పించిన వస్తువులు నిల్వ వుంచడానికి బాధ్యులను గుర్తించారా? గుర్తించి వుంటే ఎవరు? వారిపై ఏ చర్యలు తీసుకుంటున్నారు? అనే అంశాలపై కనీసం జిల్లా అధికారులైనా మీడియా ద్వారా ప్రజలకు తెలియజేసే ప్రయత్నం మూడు రోజులైనా చేయలేదు. ఈ మౌనం, సాగదీతే ప్రతిపక్షాల్లోనూ, ప్రజల్లోనూ అధికార యంత్రాంగం పట్ల అనుమానాలు తలెత్తేందుకు కారణమవుతున్నాయి. ప్రారంభంలోనే అధికారుల తీరు ఇలా వుంటే ఇక నోటిఫికేషన్ వెలువడ్డాక ఎంతమాత్రం సవ్యంగా పనిచేస్తారన్న ప్రశ్న ఆ వర్గాల నుంచీ వినిపిస్తోంది.అధికారులు తక్షణం తమ తీరు మార్చుకోకుంటే ప్రతిపక్షాలు, ప్రజల ఫిర్యాదులతో ఈసీ నుంచీ చర్యలను ఎదుర్కొనే ప్రమాదం కనిపిస్తోంది.

విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి


షాలిని మృతదేహం

గుడిపాల, మార్చి 28: గుడిపాల మండలం 197 రామాపురం పంచాయతీ సింగారపేటలో గురువారం విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతిచెందారు. సింగారపేటకు చెందిన లారెన్స్ భార్య షాలిని(46) తమ పొలంలో మోటారు స్విచ్ ఆన్‌చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయిపపడ్డారు. చికిత్స నిమిత్తం ఆమెను వేలూరు సీఎంసీకి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యా రాజకీయాలతో లబ్ధికి జగన్ వ్యూహం

● మాజీ మంత్రి అమర్ విమర్శ

పలమనేరు, మార్చి 28: హత్యా రాజకీయాలతో లబ్ధి పొందేందుకు సీఎం జగన్ చూస్తున్నారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి విమర్శించారు. పలమనేరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో జగన్ చిన్నాన్న వివేకానందరెడ్డి హత్య జరిగితే దాన్ని చంద్రబాబుపై తోసేశారన్నారు. ఆ తర్వాత ఐదేళ్ల కాలం ముఖ్యమంత్రిగా వుండి జగన్ ఏమి చేశారో ప్రజలందరికీ తెలుసన్నారు. వాళ్ల చిన్నాన్నను హత్యచేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని పక్కన పెట్టుకుని.. తన చిన్నాన్న హత్య ఆ దేవుడికి తెలుసని, ఆయన (చనిపోయిన వివేకా)కు, జిల్లా ప్రజలకు తెలుసని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వివేకా హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని సీబీఐ అరెస్టు చేయకుండా అడ్డుకొన్నది ఎవరో అందరికీ తెలుసన్నారు. 'ఇక వివేకా హత్య ఎలా జరిగిందో హత్యకు గురైన వివేకానే అడిగి తెలుసుకోవాల్సి ఉంటుంది. అది కూడా జగన్ మాత్రమే అడగాలి. ఇంకెవరూ అడగలేరు. జగనే వెళ్లి తన చిన్నాన్నతో ఎవరు నిన్ను హత్యచేశారు అని అడిగి తెలుసుకోవాలి' అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. కోడికత్తి కేసులో కూడా ఏం జరిగిందో అందరికీ తెలుసన్నారు. జగన్ నిన్న ఏమి చెప్పారో ప్రజలందరూ గుర్తుచేసుకోవాలని సూచించారు. ఇలాంటి ఆలోచనలున్న వ్యక్తిని మళ్లీ సీఎంను చేస్తే రాష్ట్రం ఏమవుతుందో ప్రజలు ఆలోచించాలని కోరారు.

నీటి ఎద్దడి ఏర్పడే గ్రామాలను గుర్తించండి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 28: ప్రస్తుత వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే గ్రామాలను గుర్తించి సోమవారం లోగా నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. గురువారం సాయంత్రం క్యాంపు కార్యాలయం నుంచి ఆయన మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల విధులతో పాటు నీటి ఎద్దడి ఏర్పడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నీటి ఎద్దడి ఉండే గ్రామాల్లో హేబిటేషన్ల వారీగా అక్కడ ఉన్న నీటి వనరులను పరిశీలించి, ఆ నీటిని సరఫరా చేసే ప్రక్రియను గుర్తించాలన్నారు. పలమనేరు, కుప్పం, పుంగనూరు ప్రాంతాల్లోని కొన్ని చోట్ల నీటి సరఫరాలో ఇబ్బందులున్నాయని, వాటిని అధిగమించడానికి చర్యలు చేపట్టాలన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి రవాణాకు అనుమతి లేదని, పొరుగున ఉన్న బోర్ల నుంచి తాత్కాలిక పద్ధతిలో సమీప గ్రామాలకు తాగునీటి సరఫరా చేయాలన్నారు. ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాల్లో వేసిన బోర్లను ఉపయోగించుకోవాలన్నారు. 250కి పైగా బోర్లున్న చోట్ల వాటి మరమ్మతులకోసం మరో మెకానిక్‌ను నియమించుకోవాలన్నారు. విడిభాగాల కొనుగోళ్లకు నివేదిక ఇవ్వాలని చెప్పారు.

ధనుష్‌ది ఆత్మహత్య కాదు.. హత్యే

మృతుడి కుటుంబ సభ్యులు, బంధువుల ఆరోపణ.. రాస్తారోకో


మృతిచెందిన ధనుష్

గంగాధరనెల్లూరు, మార్చి 28: గంగాధర నెల్లూరు మండలం వింజం దళితవాడకు చెందిన ధనుష్‌ది ఆత్మహత్య కాదని.. అమ్మాయి తరఫువారే హత్య చేశారంటూ అతడి కుటుంబీకులు, బంధువులు ఆరోపించారు. బాధ్యులను అరెస్ట్ చేయాలంటూ గురువారం సాయంత్రం వింజం బస్టాప్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. వీరు తెలిపిన ప్రకారం.. ధనుష్, దళవాయిపల్లె దళితవాడకు చెందిన ఓ అమ్మాయి ప్రేమించుకున్నారు. ఈనెల 15న వీరిద్దరూ తవణంపల్లె మండలంలోని ఓ గుడిలో పెళ్లి చేసుకోవాలని వారి బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ విషయం తెలిసి అమ్మాయి బంధువులు ధనుష్‌ని మందలించారు. అదేరోజు సాయంత్రం గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌లో వీరిద్దరి తల్లిదండ్రులను పిలిపించి పోలీసులు విచారించారు. ఆ అమ్మాయి మేజర్ అయ్యాక పెళ్లి చేసుకోవచ్చని పోలీసులు చెప్పి పంపారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం వింజం దళితవాడకు సమీపంలో ఓ చెట్టుకు ధనుష్ ఉరేసుకున్నట్లు కుటుంబీకులకు తెలిసింది. వీరి సమాచారంతో సీఐ శంకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ధనుష్ మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్ట్‌మార్టం చేసి.. గురువారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తలకు గాయమైనట్లు వారి బంధువులు గుర్తించారు. దీంతో ధనుష్ ఆత్మహత్య చేసుకోలేదని, అమ్మాయి తరఫున బంధువులు హత్యచేసి చెట్టుకు ఉరేసి వెళ్లుంటారనే అనుమానం కలిగింది. వెంటనే మూడు గంటలపాటు వింజం బస్టాప్‌వద్ద రోడ్డుపై వీరు బైఠాయించారు. ధనుష్ హత్యకు కారణమైన వారిని వెంటనే అరెస్ట్‌చేసి చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. సీఐలు శంకర్, విశ్వనాథరెడ్డి, ఎస్ఐ రామాంజనేయులు, సిబ్బంది అక్కడికి చేరుకుని రోడ్డుపై కూర్చోవడం సరికాదని సర్దిచెప్పారు. పోస్ట్‌మార్టం రిపోర్ట్ ప్రకారంగా కేసు నమోదుచేసి, హత్యకు కారణమైన వారిని అరెస్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. ధనుష్‌కు అంత్యక్రియలు నిర్వహించాలని సూచించగా.. వారు అంగీకరించలేదు. శుక్రవారం అంత్యక్రియలు చేస్తామని వారి బంధువులు తెలిపారు.

ఆరు ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఒకరి అరెస్టు


అరెస్టు చూపుతున్న పోలీసులు

మంగళం, మార్చి 28: మంగళం పరిధిలోని తిమ్మినాయుడుపాళెం సమీపంలో గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరు ఎర్రచందనం దుంగలను, లగేజీ వాహనాన్ని, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. ఆర్ఎస్ఐ సురేష్‌బాబు బృందం మంగళం, భూపాల్‌కాలనీ, తిమ్మినాయుడుపాళెం అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. బయోట్రీమ్ వద్ద లగేజీ వాహనంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు లోడ్‌చేస్తూ కనిపించారు. చుట్టుముట్టగా అందరూ పారిపోయి ఒకరు మాత్రం దొరికారు. పట్టుబడ్డ వ్యక్తి చిత్తూరు రూరల్ తుమ్మిందపాళేనికి చెందిన పవన్(23)గా గుర్తించారు. వారి నుంచి ఆరు దుంగలతోపాటు లగేజి వాహనం, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. దుంగలను హొస్కోటకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసును తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయ సీఐ శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.93 వేల నగదు సీజ్


పట్టుబడిన నగదుతో తనిఖీ అధికారులు

గుడిపాల, మార్చి 28: బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.93 వేల నగదును చెక్‌పోస్టు తనిఖీ అధికారులు సీజ్ చేశారు. వేలూరు నుంచి శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన మినీలారీలో డ్రైవర్ ఎలాంటి ఆధారాలు, బిల్లులు లేకుండా రూ.93 వేల నగదు తీసుకొస్తున్నారు. చెక్‌పోస్టు వద్ద తనిఖీ అధికారి గణపతి ఈ నగదును గుర్తించి సీజ్ చేశారు. తనిఖీలో ఏఎస్ఐ రాజేంద్రన్, పోలీసులు పాల్గొన్నారు.

జూన్ వరకు ప్రత్యేక రైళ్ల పొడిగింపు

తిరుపతి సెంట్రల్, మార్చి 28 : తిరుపతి-తిరుమల పుణ్యక్షేత్రాలకు పెరుగుతున్న భక్తుల దృష్ట్యా తిరుపతి నుంచి పలు ప్రాంతాలకు నడుపుతున్న ప్రత్యేక రైళ్లను జూన్ నెలాఖరు వరకు పొడిగించిన ట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ఓ సీహెచ్ రాకేష్ తెలిపారు. ఇందులో తిరుపతి-అకోలా మధ్య నడుస్తున్న (07605-07606)ఎక్స్‌ప్రెస్‌లు, తిరుపతి-పూర్ణ మధ్య నడుస్తున్న (07609-07610) ఎక్స్‌ప్రెస్‌లు, తిరుపతి-సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న(07481-07482)ఎక్స్‌ప్రెస్‌లు జూన్ నెలాఖరు వరకు పొడిగించినట్లు వెల్లడించారు. తిరుపతి-సాయినగర్ (షిరిడీ) మధ్య నడుస్తున్న(07637-07638)ఎక్స్‌ప్రెస్‌లు జూలై ఒకటో తేది వరకు పొడిగించామని తెలిపారు. తిరుపతి-షోలాపూర్ మధ్య నడుస్తున్న (01438-01437) ఎక్స్‌ప్రెస్‌లు జూన్ 28 వరకు రాకపోకలు సాగిస్తాయని సీపీఆర్‌వో పేర్కొన్నారు.

కోడ్ ఉల్లంఘనలపై చర్యలు చేపట్టాం: కలెక్టర్


రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 28: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అందే ప్రతి ఫిర్యాదుపైనా రాజకీయ పార్టీలకు అతీతంగా చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు రాజకీయ పార్టీలు ప్రచారాల కోసం ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. 48 గంటల ముందుగా సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 85 సంవత్సరాల పైబడిన, విభిన్న ప్రతిభావంతులకు ఇంటి నుంచే ఓటింగ్ విధానంపై కసరత్తు చేపట్టామని, అందుకు గల కారణాలను ఆయన వివరించారు. టెలివిజన్ ఛానల్‌లో, కేబుల్ నెట్‌వర్కులు, డిజిటల్ డిస్‌ప్లేలు, వాయిస్ మేసేజ్‌ల ప్రచారానికి అనుమతి తీసుకోవాలని స్పష్టంచేశారు. ఇంటింటి ప్రచారానికి రోజువారి అనుమతులు తీసుకోవాలనే దానిపై పునఃసమీక్షించాలని పలువురు నాయకులు కోరారు. ఈ అంశాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ట్రేడ్ యూనియన్ వద్ద జెండాలు తొలగిస్తున్నారని, ఇది ఎన్నికల కోడ్ పరిధిలోకి రాదని సీపీఎం గంగరాజు వివరించారు. రాజీనామా చేసిన వలంటీర్ల నుంచి సిమ్‌కార్డులు, మొబైల్స్ వెనక్కి తీసుకోవాలని కొందరు సూచించగా, వారి రాజీనామా పత్రాన్ని ఆమోదించాక తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాము పరిశీలన

రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదామును కలెక్టరు పరిశీలించారు. మే 13న పోలింగ్ ఉన్న నేపథ్యంలో 10 రోజులు ముందుగా ఈవీఎంలను పోలీసు బందోబస్తు మధ్య నియోజకవర్గ స్థాయిలో స్ట్రాంగ్ రూములకు తరలిస్తామన్నారు. మే 9న ఈవీఎంలను మరోసారి పరిశీలిస్తామన్నారు. డీఆర్‌వో పుల్లయ్యతో పాటు నేతలు అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), గంగరాజు (సీపీఎం), భాస్కర్ (కాంగ్రెస్), సురేంద్రకుమార్ (టీడీపీ), ఉదయ్‌కుమార్ (వైసీపీ) తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విధులకు ఆటంకం కేసులో

35మందికి ఐదేళ్ల జైలు

పిచ్చాటూరు, మార్చి 28 : పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ నమోదైన కేసులో ఒకే ఊరికి చెందిన 35మందికి ఐదేళ్ల జైలు శిక్ష విధించారు.కేసు వివరాల్లోకి వెళితే....పిచ్చాటూరు మండలంలోని ఎస్ఎస్‌బీ పేట తమిళనాడు సరిహద్దుకు అర్ధ కిలోమీటరు దూరంలో వుంటుంది.2018వ సంవత్సరంలో వేలంపాట ద్వారా మద్యం దుకాణం దక్కించుకున్న వారు ఇక్కడ షాపు ఏర్పాటు చేశారు.అయితే మద్యం దుకాణం వుండడం వల్ల తమిళనాడుకు చెందిన వారు అక్కడికి ఎక్కువగా వస్తుంటారని భావించిన గ్రామస్తులు గొడవలు జరుగుతుంటాయన్న ఆలోచనతో అక్కడ షాపు పెట్టడానికి వీల్లేదని పెద్దఎత్తున ఆందోళనకు దిగారు.అయితే మద్యం షాపు నిర్వహణకు లైసెన్స్ ఉన్నందున ఆందోళన విరమించుకోవాలని గ్రామస్తులను పోలీసులు హెచ్చరించారు. దీంతో రెచ్చిపోయిన పలువురు యువకులు మద్యం షాపుపై దాడి చేసి ధ్వంసం చేశారు. విధుల్లో ఉన్న పోలీసులతో కూడా గొడవకు దిగారు. దాంతో ఎస్ఎస్‌బీ పేటకు చెందిన 35మందిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.ఆరేళ్లుగా నడుస్తున్న ఈ కేసుకు సంబంధించి గురువారం సత్యవేడు న్యాయమూర్తి గోపాలకృష్ణ తీర్పు వెలువరించారు.పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు 35మందికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, వైన్‌షాపు ధ్వంసం చేసినందుకు మరో రెండు సంవత్సరాలు, షాపు నిర్వాహకులను బెదిరించినందుకు ఏడాది మొత్తంగా ఐదేళ్ళ జైలు శిక్ష విధించారు.దీంతో శిక్ష పడిన 35మందినీ కడప కారాగారానికి తరలించారు.కోర్టులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ప్రశాంతి వాదించారు. కేసు విచారణను పర్యవేక్షించినందుకు సీఐ భాస్కర్ నాయక్,ఎస్ఐ వెంకటేష్, కోర్టు పీసీ దేవరాజ్‌లను ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ , పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

వైసీపీకి ఇద్దరు కార్పొరేటర్ల రాజీనామా


● సొంత పార్టీ నాయకుల దూషణలతోనే నిర్ణయం



తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 28: తిరుపతి నగరపాలక సంస్థ 48,49 డివిజన్ల కార్పొరేటర్లు అన్నా అనితాయాదవ్, డాక్టర్ అన్నా సంధ్యాయాదవ్ వైసీపీకి రాజీనామా చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు తమ తండ్రి అన్నా రామచంద్ర యాదవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలోని కొందరు వైసీపీ నాయకుల పద్ధతులు నచ్చక తమ తండ్రి బుధవారం పార్టీకి రాజీనామా చేశారని చెప్పారు.దీంతో కొంతమంది వైసీపీ యాదవ నేతలు ప్రెస్‌మీట్ పెట్టి ఇద్దరు కుమార్తెలతో కూడా రాజీనామా చేయించాలని సవాల్ చేశారని, అలాగే తమ తండ్రిపై అనేక ఆరోపణలు చేశారన్నారు. సొంత పార్టీ నాయకులు ఇష్టారీతిన దూషించడంతో తాము పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు వెల్లడించారు. అనంతరం అన్నా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ... వైసీపీ నాయకులు పెట్టే టార్చర్ భరించలేక తన బిడ్డలు చాలా ఇబ్బంది పడ్డారన్నారు. కనీసం వార్డు వలంటీర్లను నియమించుకునే పరిస్థితి కూడా లేదంటే పార్టీలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు.వైసీపీ యాదవ నేతలు చేసిన ఆరోపణలను విలేకరులు ప్రస్తావించగా... కాపు, ఒంటరి, తెలగ, బలిజ కులాలను బీసీ జాబితాలో చేర్చడం మంచిది కాదని తాను టీడీపీలో ఉన్నపుడు దీక్షకు కూర్చున్నట్టు వెల్లడించారు. తనను అరెస్ట్ చేసేందుకు పెద్దసంఖ్యలో పోలీసులు రాగా అరెస్ట్ చేయొద్దని కరుణాకరరెడ్డి చెప్పడంతో వెనక్కు వెళ్లిపోయారని చెప్పారు. అయితే తనను ఎన్‌కౌంటర్ చేసేందుకు టీడీపీ ప్రయత్నించిందంటూ కరుణాకరరెడ్డి మరునాడు పత్రికా ప్రకటన ఇవ్వడంతో ఆశ్చర్యపోయానన్నారు.తానెప్పుడూ పదవులు అడగలేదని, ఆయనే తన ఇంటికివచ్చి తన చిన్న కుమార్తెకు మేయర్ పదవి ఇస్తానని కొడుకు, మనవడి మీద ప్రమాణంచేసి చెప్పారని వెల్లడించారు. ఆ సమయంలో పాలగిరి ప్రతాపరెడ్డి, సిద్దారెడ్డి పక్కనే ఉన్నారన్నారు.తీరా మేయర్ నియామకం అయిన తరువాత ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామితో మళ్లీ తమ ఇంటికివచ్చి చివరి రెండున్నర సంవత్సరాలు మేయర్ పదవి ఇస్తానని కొందరు మీడియా ప్రతినిధుల సాక్షిగా, వేంకటేశ్వరస్వామి సాక్షిగా చెప్పారని, తాను వద్దన్నానని వివరించారు.మేయర్ పదవి తాము అడిగామో, ఆయన ఇస్తానన్నారో కరుణాకరరెడ్డే సమాధానం చెప్పాలిగాని ఈ విషయాలేవీ తెలియని వారు ఏవేవో మాట్లాడడమేంటని ప్రశ్నించారు.తన కుమార్తెలు కార్పొరేటర్లుగా కొనసాగుతారని చెప్పారు.

వైసీపీ ప్రచార, ప్రభావిత సామగ్రి విలువ రూ.46కోట్లు

● జిల్లా ఎన్నికల అధికారికి నివేదిక అందజేత



వైసీపీ ప్రచార సామగ్రి వున్న పీసీఆర్ గోదాము - గోదాముకు వేసిన తాళం

రేణిగుంట, మార్చి 28: తిరుపతి విమానాశ్రయ సమీపంలోని ప్రైవేటు గోదాముల్లో నిల్వ ఉంచిన వైసీపీ ప్రచార సామగ్రి విలువ రూ.46కోట్లుగా అధికారులు అంచనా వేశారు.దాదాపు 70మంది వీఆర్వోలు, వీఆర్ఏల చేత ప్రచార సామగ్రి పంచనామా రహస్యంగా నిర్వహించారు. పాత విమానాశ్రయం వద్ద ఉన్న రెండు గిడ్డంగుల్లో రూ.23కోట్లు, రేణిగుంట-శ్రీకాళహస్తి ప్రధాన రహదారిలోని పీసీఆర్ గోదాములో రూ.23కోట్ల విలువ చేసే వైసీపీ ప్రచార సామగ్రిని, వస్తువులను విడివిడిగా లెక్కకట్టారు. ఈ నివేదికలను జిల్లా ఎన్నికల అధికారికి బుధవారం రాత్రి సమర్పించారని సమాచారం.రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు దీనిపై జిల్లా ఎన్నికల అధికారి పంపే నివేదికను బట్టి తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉండనుంది. మరోపక్క సీజ్ చేసిన గిడ్డంగుల వద్ద పోలీసు, రెవెన్యూశాఖ ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్నారు.

సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ముమ్మరంగా తనిఖీలు

మదనపల్లె టౌన్, మార్చి 28: మదనపల్లె మండలంలోని చీకిలబైలు వద్ద కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పోలీసులు, ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇటీవల మదనపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో, నాలుగు చోట్ల డబ్బుతో పాటు, వెండి ఆభరణాలు పట్టుబడటంతో అధికారులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. మదనపల్లె ఎఫ్ఎస్‌టీ బృందం శ్రావణి ఆధ్వర్యంలో చెక్‌పోస్టుతో పాటు, పట్టణంలోని పలు చోట్ల వాహనాలు తనిఖీ చేస్తున్నారు. దీంతో పాటు చీకిలబైలు చెక్‌పోస్టు వద్ద ఎస్ఈబీ సీఐ మోహీయిద్దీన్‌తో సిబ్బంది, తాలూకా పోలీసులు ప్రత్యేక బృందాలుగా కార్లు, ద్విచక్రవాహనాలు, బస్సుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇదిలా వుంటే భారీ కంటైనర్లను తనిఖీ చేయకుండా వదిలేస్తున్నారు. దీంతో పాటు బెంగళూరుకు సిమెంటు మిక్సర్ తరలించే కోర్ వాహనాలను కూడా తనిఖీలు చేయాల్సి ఉంది. పెద్ద ఎత్తున డబ్బులు, తాయిళాలు తరలించే రాజకీయ నాయకులు ఎక్కువగా ఇలాంటి భారీ వాహనాల్లోనే రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది.

చెట్టుపై నుంచి పడి మహిళకు తీవ్రగాయాలు

మదనపల్లె టౌన్, మార్చి 28: మేకలకు ఆకులు కోసేందుకు చెట్టెక్కిన మహిళ పట్టుతప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడింది. మదనపల్లె మండలం టేకులపాలెం గ్రామానికి చెందిన సుబ్బన్న భార్య నరసమ్మ(45) గురువారం గ్రామ సమీపంలోని సుబాబుల్ చెట్టు ఎక్కి మేకలకు ఆకులు కోస్తుండగా పట్టుతప్పి కింద పడిపోయింది. దీంతో ఆమె వెన్నెముకకు తీవ్ర గాయం కావడంతో కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు.

వక్ఫ్ భూమిలో అక్రమ నిర్మాణాలు ఆపండి



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్, జమాత్ సభ్యులు

పీలేరు, మార్చి 28: పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె పంచాయతీలోని వక్ఫ్ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు ఆపాలని జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ వసీం అక్రమ్ పీలేరు తహసీల్దారు మహబూబ్ బాషాకు ఫిర్యాదు చేశారు. బోడుమల్లువారిపల్లె పంచాయతీ పరిధిలోని సర్వే నెం. 585లో 4.39 ఎకరాల వక్ఫ్ భూమి ఉందని, జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో దాని విలువ అమాంతం పెరిగిపోయిందని, దీంతో కొంత మంది ఆ భూమిలో ఎటువంటి రిజిస్ట్రేషన్, పంచాయతీ అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపట్టారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

శక్తి వనరులను ఆదా చేయటం ప్రతి ఒక్కరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం సావిత్రి

వాల్మీకిపురం, మార్చి 28: శక్తి వనరులను ఆదా చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సావిత్రి పేర్కొన్నారు. గురువారం స్థానిక పాఠశాలలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ ఆధ్వర్యంలో ఎనర్జీ క్లబ్‌లను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం సావిత్రి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే శక్తి వనరులను పొదుపుగా వాడాలని, ఐదు నక్షత్రాల విద్యుత్ ఉపకరణాలను వినియోగించాలని అన్నారు. పాఠశాలలో ఇంట్లో ప్రతినెలా కొన్ని యూనిట్ల విద్యుత్‌ను పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. శక్తి వనరుల పరిరక్షణ-విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. విద్యుత్ పొదుపును ప్రతిబింబించే చిత్రలేఖన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తర్వాత విద్యుత్ పొదుపుని తెలిపే అవగాహనా పోస్టర్లను ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కల్పన, ఉపాధ్యాయులు రమణప్ప, వసుమతి, భాస్కర్‌నాయక్, సుజాత, కల్పలత, నాగరాజ, రవీంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి దోహదపడే పరిశోధనలు చేపట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ షాహీద్ మునీర్ పాషా

కురబలకోట, మార్చి 28: దేశాభివృద్ధికి దోహదపడే పరిశోధనలు చేపట్టాలని జేపీ మోర్గాన్ చేస్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ షాహీద్ మునీర్ పాషా పేర్కొన్నారు. మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సైబర్‌సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలను అరికట్టడానికి నూతన టెక్నాలజీలపై దృష్టి సారించి విజయాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామనాథమ్, విభాగాధిపతి గంగాదేవీ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ తరగతులు

మదనపల్లె టౌన్, మార్చి 28: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్వహించనున్న పాలిసెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. జీఎంఆర్ కళాశాలలో సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ డిప్లొమో కోర్సులు ఉన్నాయన్నారు. పాలిసెట్-2024ను ఏప్రిల్ 27వ తేది నిర్వహించనున్నారని, టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి తమ కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి వారి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

మైనారిటీల రక్షణకు బాబు భరోసా



ప్రజాగళం విజయవంతంపై మాట్లాడుతున్న కూటమి ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా, టీడీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, మార్చి 28: కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఎన్ఆర్‌సీ, సీఏఏ బిల్లులతో మైనారిటీల రక్షణకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారని మదనపల్లె ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా స్పష్టం చేశారు. గురువారం చంద్రబాబుకు వీడ్కోలు పలికిన అనంతరం సుభాష్‌రోడ్డులోని షాజహాన్‌బాషా నివాసం వద్ద విలేకర్ల సమావేశం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సభకు విశేషంగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలందరికి ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ, జనసేన పొత్తు రాష్ట్ర అవసరాల కోసమే అని, రాష్ట్రం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ సహకారం ఉండాలని అందుకే పొత్తు పెట్టుకున్నారన్నారు. చంద్రబాబు సభలో స్పష్టమైన హామీలు ఇచ్చారన్నారు. మదనపల్లె కేంద్రంగా జిల్లా ఏర్పాటు, కాపు, బలిజలకు ప్రధాన రహదారి పక్కనే స్థలం కేటాయించి రూ.1.50కోట్లతో కమ్యునిటి భవనం నిర్మిస్తారన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించడానికి బాహుదానదిపై బ్రిడ్జిల నిర్మాణం చేయిస్తారన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్య తగ్గిస్తారన్నారు. వచ్చే 46 రోజుల పాటు టీడీపీ, జనసేన, బీజేపీ సైనికులు ప్రతి ఒక్కరు పట్టణంలోని 35 వార్డులు, నియోజకవర్గంలోని 55 గ్రామ పంచాయతీల్లో విస్తృతంగా పర్యటిస్తూ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించాలని కోరారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మాట్లాడుతూ చంద్రబాబు పాల్గొన్న ప్రజాగళం సభ విజయవంతం అయ్యిందన్నారు. షాజహాన్‌బాషాను టీడీపీ అభ్యర్థిగా ఖరారు చేసినప్పుడు ఆయన విజయం ఖరారు అయ్యిందని, వైసీపీ నాయకుల వెన్నులో వణుకు పుడుతోందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు మార్పూరి సుధాకర్‌నాయుడు, విద్యాసాగర్, ఎస్ఏ మస్తాన్, దొరస్వామినాయుడు, గౌతమ్‌రెడ్డి, పఠాన్‌ఖాదర్‌ఖాన్, ఎస్. సుధాకర్, బాలుస్వామి, కత్తి లక్ష్మన్న, ఈశ్వరనాయుడు, ప్రొఫెషనల్ విభాగం అధ్యక్షుడు పెరవలి నవీన్, రాటకొండ రాజేష్, నిరంజన్‌నాని తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు పర్యటనతో టీడీపీ గెలుపు ఏకపక్షమే'

మదనపల్లె టౌన్, మార్చి 28: మదనపల్లెలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పర్యటనతో ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా గెలుపు ఏకపక్షమే అని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ పేర్కొన్నారు. గురువారం నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో వెంకటేశ్ మాట్లాడుతూ మదనపల్లెలో చంద్రబాబు బహిరంగ సభతో టీడీపీలో కొత్త జవసత్వాలు పెరిగాయన్నారు చంద్రబాబు సీఎం అయితేనే మదనపల్లె అభివృద్ధి చెందుతుందని ప్రజలు స్వచ్ఛందంగా బహిరంగ సభకు వచ్చారని గుర్తుచేశారు. మంగళగిరిలో టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ వాహనాలను రోజుకు మూడు సార్లు తనిఖీ చేస్తున్న పోలీసులు, అక్కడి వైసీపీ నేత రామకృష్ణారెడ్డి వాహనాలు యథేచ్ఛగా తిరుతుగున్నా పట్టించుకోలేదన్నారు. ఎన్నికల సంఘం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు చంద్రగిరి నియోజక వర్గంలో పెద్ద ఎత్తున వైసీపీ ఎన్నికల తాయిలాలు నిల్వ చేసినా వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నవీన్, అన్వర్‌బాషా, రాజన్న, రెడ్డెప్ప, రామ్మూర్తి, చలపతిరావు పాల్గొన్నారు.

కమనీయం.. నరసింహస్వామి కల్యాణం



గుర్రంకొండలో అలంకరణలో స్వామి వారు



పీటీఎం వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గుర్రంకొండ, మార్చి 28:మండలంలోని తరిగొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని వేదపండితులు గురువారం వైభవంగా కమనీయంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున కల్యాణం చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా చేశారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పాపేపల్లి నృసింహుడి కల్యాణం

పెద్దమండ్యం, మార్చి 28: పెద్దమండ్యం మండలం పాపేపల్లి కుషావతినది తీరంలో ఏకశిలగుట్టపైమాండవ్య మహర్షి చే ప్రతిష్ఠింపబడిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం బుధవారం రాత్రి వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి మేల్కొలిపి ఆలయశుద్ధి తోమాలసేవ, అర్చన, అభిషేకాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారికి కల్యాణోత్సవానికి స్వామి వారితో పాటు శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను ఆకర్షణీయంగా అలకరించి మంగళవాయిద్యాలతో మండపం వద్దకు తీసుకువెళ్లారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ స్వామి వారి కల్యాణోత్సవం కనుల పండుగగా జరిగింది. అనంతరం వేకువ జాము నుంచి శ్రీలక్ష్మీ నరసింహస్వామి రథంపై పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లారు. గురువారం రాత్రి స్వామి వారు అశ్వ వాహనంపై ఆధిరోహింప జేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలకరించారు. చాందిని బండ్లు కట్టి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి రమణ, సర్పంచ్ పీరాన్‌బీ, ఎంపీపీ పూర్ణచంద్రిక రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు గీత, ఉభయదారులు గాలివీడు ఎగవగొట్టివీడు, చిన్నమండ్యం పడమటికోన భక్తులు, గొల్లవానికుంట సుబ్బానాయుడు, నరసింహులు, ప్రభాకరెడ్డి, రామిరెడ్డి, హరికృష్ణారెడ్డి, సుధాకర, గల్లా నారాయణ, కుళాయిరెడ్డి,, సుబ్బరామయ్య, అర్చకులు, గ్రామస్థులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వరాహ లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు

పెద్దతిప్పసముద్రం మార్చి 28 : మండలంలోని కందుకూరులో వెలసిన వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం పీటీఎంకు చెందిన ఆధ్యాత్మిక వేత్త సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. నరసింహస్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన స్వాతి నక్షత్రం కావడంతో ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకం, మహామంగళారతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి కందుకూరుతో పాటు సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు సనగరం పట్టాభిరామయ్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రెడ్డెమ్మ హుండీ ఆదాయం రూ.4.72 లక్షలు



రెడ్డెమ్మ ఆలయ హుండీని లెక్కిస్తున్న అధికారులు

గుర్రంకొండ, మార్చి 28:గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో గురువారం అమ్మవారి హుండీ దేవాదాయశాఖ అధికారులు లెక్కించగా రూ.4,72,290 ఆదాయం వచ్చింది. దేవదాయశాఖ అధికారి రవికిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. ఈ క్రమంలో అమ్మవారికి హుండీ ద్వారా రూ.4,72,290 నగదు, 17 గ్రాముల బంగా రం, 260 గ్రాముల వెండీ వచ్చిందన్నారు. ఈ మొత్తాన్ని ఆలయా భివృద్ధికి వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో ఈవో మంజుల, చైర్మెన్ నరసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లె నూతన బార్ అసోసియేషన్ ఎంపిక



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మదనపల్లె టౌన్, మార్చి 28: మదనపల్లె బార్ అసో సియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎంపిక చేశారు. ఎన్నికల అధికారులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో నూతన అధ్యక్షుడుగా తొట్లి వెంకటరమణారెడ్డి, ఉపాధ్యక్షుడుగా కాలం రఘుపతి, ప్రధాన క్యాదర్శిగా బయ్యారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సురేష్‌బాబు ఎన్నిక య్యారు. వారితో పాటు లైబ్రరీ కార్యదర్శిగా ప్రసాద్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా వేణుగోపాల్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులు గా మేడా లక్ష్మీకాంత్, శైలజ, కరీముల్లా, పర్వేజ్ అహ్మద్, సోమశేఖర్, శివశంకర్, మంజునాథ్, యశ్వంత్ కృష్ణ ఎన్నికయ్యారు.

గురుకుల విద్యార్థినులకు మెరిట్ అవార్డులు



మెరిట్ అవార్డులు అందజేస్తున్న ప్రిన్సిపాల్

కలికిరి, మార్చి 28: రంగోత్సవ్ సెలెబ్రేషన్స్ ఆర్గనైజేషన్ అనే సంస్థ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో కలికిరి బీసీ గురుకుల పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థినులు ఉత్తమ అవార్డులు దక్కించుకున్నారు. కార్టూన్ విభాగానికి సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో పి.హేమకు ద్వితీయ బహుమతి, మిగతా విభాగాల్లో ఎల్.సింధు, ఎ.శరణ్య, వి.మయూరి మెరిట్ అవార్డులు సాధించారు. ఇక ఇవే పోటీల్లో పాల్గొన్న డి.నవ్యశ్రీ, సి.ధనుశ్రీ, ఎం.నిఖిల, వి.ఈషిత, టి.భవ్యశ్రీ, వై.తనూజాలకు మెరిట్ అవార్డులు, ఎస్.బిబూతి కృష్ణ, కె.నవ్యశ్రీ, ఎ.లక్ష్మీప్రియ, కె.ఖ్యాతి కన్సొలేషన్ బహుమతులు సాధించారు. రంగోత్సవ్ సంస్థ పంపిన పతకాలను, మెరిట్ సర్టిఫికెట్ల ను గురువారం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ విద్యార్థి నులకు పంపిణీ చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ టీచర్ ఖాజాబీ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార అనుమతులను సరళంగా ఇవ్వాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి

మదనపల్లె టౌన్, మార్చి 28: ఎన్నికల ప్రచారాలు, సభలు, సమావేశాలు, ప్రచార వాహనాల అనుమతుల విషయంలో రిటర్నింగ్ అధికారి సరళంగా ఇవ్వాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు కోరారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో మదనపల్లె అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హరిప్రసాద్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రచార అనుమతుల విషయమై జిల్లా కలెక్టర్, ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళతామన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఓటరు జాబితాలో వారి పేర్లను సరిచూసుకోవాని, ఏదైనా తప్పొప్పులు వుంటే ఏప్రిల్ 1వ తేదీ లోపు సవరించుకోవాలన్నారు. అలాగే ఏప్రిల్ 1వ తేదికి 18 ఏళ్ల వారందరు ఓటుహక్కు పొందవచ్చన్నారు. సమావేశంలో తహసీల్దార్ రమాదేవి, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రశాంతతకు చర్యలు

ములకలచెరువు, మార్చి 28: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్, సీఐ తమ్మిశెట్టి మధు పేర్కొన్నారు. ఓటర్లు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ములకలచెరువులో గురువారం బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. తహసీల్దార్ అనీల్‌కుమార్, ఎస్ఐ తిప్పేస్వామి నపాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

గుర్రంకొండ, మార్చి 28:ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు స్వచ్ఛందగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ శ్రీనాథ్ పేర్కొన్నారు. ఓటు హక్కుపై గురువారం గుర్రంకొండలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఓటరు ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలంటూ ఓటర్ల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో జగదీశ్వరరెడ్డి, ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

తంబళ్లపల్లె మార్చి 28 : తంబళ్లపల్లె మండలంలోని వివిధ గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్త వహించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్ కుమార్ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడివో కార్యాలయంలో ఎంపీడివో కృష్ణమూర్తి, ఈవోఆర్డీ దిలీప్‌కుమార్ నాయక్ లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి వనరులపై కార్యదర్శులతో పాటు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తాగునీటి బోర్లలో నీరు తగ్గినా, మోటర్లు పని చేయకపోయినా వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. వేసవి కాలం సమీపిస్తున్న దృష్ట్యా కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కారుతోనే రాష్ట్రాభివృద్ధి

- రాష్ట్రం బాగుపడాలంటే జగన్ దిగిపోవాలి
- ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించుకోవాలి
- తంబళ్లపల్లె అభ్యర్థి జయచంద్రారెడ్డి



మాట్లాడుతున్న కూటమి ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మార్చి 28: డబుల్ ఇంజన్ సర్కారుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఘన విజయం సాధించి డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పాటు కావడం ఖాయమన్నారు. ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించుకోవాలని లేకుంటే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. ఒక్క ఛాన్సు పేరుతో అధికారంలో వచ్చిన జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. మద్యంపాన నిషేధం చేస్తానని చెప్పి మాటతప్పాడన్నారు. విద్యుత్ బిల్లులు పూర్తిగా తగ్గిస్తానని చెప్పి తొమ్మిది సార్లు పెంచాడన్నారు. ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని, 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చెస్తానని చెప్పి మాట తప్పాడన్నారు. ఇసుకను అక్రమంగా తరలించి రూ.50వేల కోట్లు లూటీ చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. రాష్ట్రాన్ని డ్రగ్గాంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పి ఉద్యోగులను మోసం చేశాడన్నారు. రాష్ట్రంలో అరాచక, అవినీతి పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో పీటీఎం మండల అధ్యక్షుడు అనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ విభాగాలను మరింతగా పటిష్టం చేయండి



చంద్రబాబును కలిసిన పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్

కురబలకోట, మార్చి28: ప్రతి నియోజకవర్గంలో బీసీ విభాగాలను మరింతగా పటిష్టం చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పార్టీ శ్రేణులను ఆదేశించారు. మదనపల్లె పర్యటనకు విచ్చేసిన ఆయనను రాజంపేట బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ ఆధ్వర్యంలో బీసీ విభాగం నేతలు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో పర్యటించి టీడీపీ చేపట్టబోయో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. టీడీపీ గెలుపే గెలుపే లక్ష్యంగా పని చేయాలని, అధికార పార్టీ బీసీలపై చేస్తున్న దాడులను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

విద్యుత్ స్తంభాలపై నాయకుల ఫొటోలు తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌వో రమ

పీలేరు, మార్చి 28: పీలేరు పట్టణం పలు ప్రాంతాల్లోని విద్యుత్ స్తంభాలపై ఉన్న అధికార పార్టీ నేతల ఫొటోలను తొలగించాలని టీడీపీ నేతలు పీలేరు నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారిణి రమకు విజ్ఞప్తి చేశారు. పీలేరు తహసీల్దారు కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ, కట్టుకాలువ వీధి, తిరుపతి రోడ్డు, కడప రోడ్డు ప్రాంతాల్లోని విద్యుత్ స్తంభాలపై కేవలం ప్రచారం కోసం కొంత మంది స్థానిక నాయకులు అధికార పార్టీ నేతల ఫొటోలు ముద్రించారని తెలిపారు. దాని గురించి తాము ఇప్పటికే సి-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. తమ పరిధిలోని ఇళ్లను వలంటీర్లు రాత్రిళ్లు సందర్శించి అధికార పార్టీకి ఓటు వేయాలని ప్రజలను కోరుతున్నారని, వారి వద్ద ఉన్న ప్రభుత్వ ఫోన్లను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎంసీసీ పర్యవేక్షణాధికారి, పీలేరు ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి మాట్లాడుతూ వాటిని తొలగించమని పంచాయతీ అధికారులుకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, విద్యుత్ సరఫరాతో ముడిపడిన అంశం కావడంతో కాసింత ఆలస్యమవుతోందన్నారు. వలంటీర్ల వద్ద నుంచి ఫోన్లు స్వాధీనం చేసుకునే అంశం ఎన్నికల సంఘం పరిగణలో ఉందని, తగిన ఆదేశాలు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. సహాయ రిటర్నింగ్ అధికారిణి రమ మాట్లాడుతూ వచ్చే నెల 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం వచ్చే నెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన ఈ నెల 16వ తేదీ వరకు నియోజకవర్గ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫారం-6లు 3414, ఫారం-7లు 2130, ఫారం-8లు 2063 దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికలతో సంబంధం ఉన్న ప్రతి పనికీ ముందస్తుగా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పీలేరు తహసీల్దారు మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఎన్నికల సంఘం ఆదేశాలు ధిక్కరించిన నలుగురు వలంటీర్లు, ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులను విధుల నుంచి తొలగించామని వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఏపీ పెన్షనర్స్ పార్టీ డిమాండ్లను పరిష్కరించండి




ఉమ్మడి అభ్యర్థికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీ పెన్షనర్స్ పార్టీ నాయకులు

మదనపల్లె అర్బన్, మార్చి28: ఏపీ పెన్షనర్స్ పార్టీ డిమాండ్లను పరిష్కరించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఆమేరకు మదనపల్లెకు విచ్చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుకు మదనపల్లె ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్ బాషా ద్వారా ఏపీ పెన్షనర్ల పార్టీ నాయకులు తమ సమస్యలను పరిష్కరించాని వినతిపత్రం అందజేశారు. ఇందులో ముఖ్యంగా పెన్షనర్ల కోసం వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, మదనపల్లెలో పెన్షనర్లకు, సీనియర్ సిటిజన్స్‌కు భవనం కల్పించాలని, పీఆర్సీ బకాయిలు, డీఆర్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్‌లకు ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దన్న గౌడు, మదనపల్లెకు ఆహ్వానించి రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ పెన్షనర్ల పార్టీ మదనపల్లె అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ, తిమ్మయ్య, శ్రీనివాసులు, జగన్‌మోహన్, కృష్ణమూర్తి, కృష్ణకుమార్,ఎన్వీనాయుడు, మగ్బుల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ సీనియర్ కార్యకర్త మృతి

పెద్దతిప్పసముద్రం మార్చి 28 : మండలంలోని రంగసముద్రంకు చెందిన టీడీపీ సీనియర్ కార్య కర్త కుమ్మర సుబ్బరాయప్ప (70) అనా రోగ్యంలో గురువారం మృతి చెందా డు. విషయం తెలుసుకున్న తంబ ళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ, జన సేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దాసరి పల్లె జయచంద్రారెడ్డి గురువారం వారి స్వగ్రామమైన రంగసముద్రంకు చేరుకుని సుబ్బరాయప్ప పార్థీవ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించా రు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఓ మంచి టీడీపీ కార్యకర్తను కోల్పోయామని ఆయన విచారం వ్యక్తం చేశారు. సుబ్బరాయప్ప టీడీపీకి చేసిన సేవలు మరువలేమని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంజనేయులు, చంద్రమోహన్‌రెడ్డి, మహబూబ్‌బాషా, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల రాజా మృతి తీరని లోటు



ఎద్దుల రాజా భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లి, మార్చి 28: తంబళ్లపల్లి మండలం ఆర్ఎన్‌తాండ గ్రామ పంచాయతీ ఎద్దులవారిపల్లికు చెందిన జనసేన కార్యకర్త ఎద్దుల రాజా మృతి జనసేన, టీడీపీకి తీరని లోటని కూటమి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి, జనసేన ఇన్‌చార్జ్ సాయినాథ పేర్కొన్నారు. గుండెపోటుతో మృతి చెందిన ఎద్దుల రాజా మృతదేహం వద్ద గురువారం దాసరిపల్లి జయచంద్రారెడ్డి కల్పనారెడ్డి దంపతులు, జనసేన ఇన్‌చార్జ్ సాయినాధలు నివాళులు అర్పించారు. రాజా కుంటుబ సభ్యులను ఓదార్చి కుటుంబానికి ఎప్పుడూ అండా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార సరుకుల పంపిణీ

పీలేరు, మార్చి 28: క్షయ వ్యాధిగ్రస్తులకు రెండు నెలలకు సరిపడా పోషకాహార విలువలుగల సరుకులను పీలేరులో గురువారం పంపిణీ చేశారు. కోహన్స్ లైఫ్ సైన్సెస్ వారి దాతృత్వంతో సమకూర్చిన ఈ సరుకులను డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు క్షయ విభాగం సిబ్బంది మోహన్, పవన్‌కుమార్, మునీశ్వర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.